# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 34 సంచిక 10
పేజీలు 40
జూన్ 2015

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ........ పేజీ**

భద్రవాక్యం ....................2
శ్రీబాబూజీ ఉవాచ....................3
అమ్మమాట....................5
సద్గురు సమాశ్రయం గుణరహితం....................7
కొప్పులింగేశ్వరుడు ....................9
సన్నిధిలో సంభాషణ ....................11
యోగవాశిష్ఠము ....................13
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................15
పరిప్రశ్నేన సేవయా....................16
మౌనమేలనో స్వామి.................... 18
గీతాధ్యయనమ్....................19
శ్రీకృష్ణకర్ణామృతము....................21
మానసిక శక్తిని పెంపొందించుకున్న యోగి23
అమృతబిన్దూపనిషత్ ....................24
యెస్.హె.చ్.కె.వి.పి.బి.టి.ఆర్ స్కూల్....................28
సాలెవాడు- రామేచ్ఛ....................29
ఇంద్రద్యుమ్నుడు ....................31
సత్సంగామృతం....................32
పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు.....34
వైశాఖపూర్ణిమ విశిష్ఠత ....................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర..........37
విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అసుర్యానామ తే లోకాః అన్ధేన తమసా వృతాః ।
తాగ్ంస్తే ప్రేత్యాభి గచ్ఛన్తి ఏకే చాత్మహనో జనాః ॥
(ఈశావాశ్యోపనిషత్ - 3శ్లో॥)

జగత్తు అంతా ఈశ్వర తత్త్వమే వ్యాప్తమై ఉన్నదన్న విషయం గ్రహించి, కామ క్రోధాది పరాప్రకృతిని విడిచి, స్వప్నంలో కూడా భౌతిక, వ్యావహారిక వాస్తవికతను సమ్మతించనివారు ఈశ్వర తత్త్వాన్ని అనుభవించ గలగుతారన్న విషయం అవగతమే కదా!

అయితే లోకంలో ఎక్కువ మంది ప్రవర్తన దీనికి భిన్నంగా ఉండటానికి కారణం? త్రిగుణాత్మక ప్రవృత్తి స్థూల, సూక్ష్మ కారణ శరీరాలలో వ్యాపించి, ఇంద్రియ కదలికలలో క్రియలలో దాని ప్రభావాన్ని విస్తరించి, జీవుని ఆ ప్రభావానికి గురిచేస్తోంది. అదే అజ్ఞానము.

దాని ప్రభావం చేత గ్రుడ్డివారై, తమోగుణానికి దాసులై వారి ప్రవర్తన ఈశ్వరతత్త్వానికి దూరమై, సంకల్పం నుండి ఫలితం వరకు రాక్షస జీవితాన్ని గడుపుతూ, దేహాన్ని విడిచినా, వేరొక దేహాన్ని అశ్రయించి, ఏ దేహంలోనైనా అదే ప్రవృత్తి కొనసాగుతోంది. ఈశ్వర మయమైన జగత్తు గాని, ఈశ్వరతత్త్వంగాని, రాక్షస ప్రవృత్తికి కారణం కాదు కదా. మరి దీనికి కారణం ఏమిటి?

జీవుడు ఆచరించిన కర్మ అని మీరు అనవచ్చు. కాని ఉపనిషత్ స్పష్టంగా 'కుర్వన్నేహ కర్మాణి' అని బోధించటమేగాక, 'న కర్మ లిప్యతే నరే' అని కూడా హెచ్చరిస్తోంది. కర్మ ఎన్నడూ బంధించదు. ఇంద్రియ కర్మల్ని సాధన చతుష్టయ సంపద వృద్ధి చేసుకునే దిశగా ఆచరిస్తే బంధన ఉండదు. జీవుడు చేసే కర్మకు సంకల్పం, క్రియ, ఫలం అని మూడు స్థాయిలు ఉంటాయి. తన జీవిత ధ్యేయం ఈశ్వరతత్త్వాన్వేషణ అనేది గ్రహించగల్గిన జీవుడు ఆచరించే కర్మ ఆ మూడు స్థాయిలలోను, ఆ దిశలోనే ఉంటాయి కాబట్టి బంధనకి తావు ఉండదు. అలా కాని పక్షంలో బంధన తప్పదు.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీబాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "గురువు అంటే ఎవరనుకున్నారు? సాక్షాత్తు త్రిమూర్తి స్వరూపుడు ఆయన కృపని సాధించని జన్మ వృథా, గురువాజ్ఞాపాలన అంటే శాసనము అన్నమాట గురువాజ్ఞాపాలన చేసిన వాడే గురుమూర్తి అందించిన ప్రేమకి పాత్రుడు. సద్గురుమూర్తి ఏది ఆజ్ఞాపిస్తే అది చేయాలి. ఎవరికి ఏ సేవ ఇస్తే వారు అదే చెయ్యాలి. నీ శరీరంలో ఒక ఇంద్రియం చేసే పని ఇంకొక ఇంద్రియం చేయ గల్గుతుందా! మీ అందరూ ఎవరికి అప్పగించిన బాధ్యతలు వారు నిర్వహిస్తే కావలసింది ఏముంది! సద్గురు మూర్తి శక్తిని ఎవరు అంచనా వేయగలరు చెప్పండి.



శ్రీ రామచంద్రుడు వానరులంతా వారధి నిర్మిస్తుంటే వారు చేసే సేవని తిలకిస్తున్నాడు. శ్రీరామచంద్రుడు హనుమకి చిన్న పరీక్ష పెట్టాడు. వానరులతోపాటు శ్రీరామచంద్రుడు కూడా ఒక రాయి తీసుకుని వారధి కట్టే ప్రదేశంలో నీటిపైన వదిలిపెట్టాడు. విచిత్రమేమంటే ఆ రాయి నీటిలో మునిగి పోయింది. వెంటనే హనుమని పిలిచి 'హనుమా మీరు నీటిలో వదిలిన రాళ్ళు నీటిపైన తేలి ఉన్నాయి. నేను వదిలిన రాయి మునిగిపోయింది. చాలా విచిత్రంగా ఉంది సుమా!' అన్నాడు.

వెంటనే హనుమచేతులు జోడించి 'రామచంద్రా నన్ను మాయలో పడేయకు. సద్గురుమూర్తి ఆశ్రయాన్ని వదిలిన వారికి శ్రీరామ ప్రభువు చేయి వదిలిన రాయికి పట్టిన గతే పడుతుంది ప్రభూ!' అన్నాడు. చూసారా అదీ విశ్వాసము అంటే! అటువంటి గురుభక్తి ఉన్న శిష్యుడే గురుకృపకి అర్హుడు. అంతేగాని గురుమూర్తి యెడల వినయ విధేయతలు లేని శిష్యుడు ఎన్నడూ తరించడు సరికదా కుంభినీ పాక నరక ప్రాప్తి తప్పదు.

జాగ్రదావస్థ అనెడి స్వప్నంలో కలలు కనే మానవుడిని నిదుర నుండి మేల్కొలిపి తన నిజ జాగ్రదావస్థని తెలియజేసే సద్గురుమూర్తిని

ఎలా మరచిపోతారయ్యా? నిజ జాగ్రదావస్థలో నిన్ను నీవు గుర్తించ గల్గుతావు. నీ నిజస్థితిని గుర్తించినపుడే నీవు జననమరణ విష వలయము నుండి రక్షింపబడి అమృతత్త్వాన్ని సాధించగల్గుతావు.

సద్గురుమూర్తిని ఆశ్రయించి విశ్వాసంతో ఆయన ప్రసాదించిన లక్ష్యార్థాన్ని ధ్యానించే గురుబిడ్డ దురదృష్టవశాత్తు మనస్సులో ఏదైనా నీచ భావము గాని నీచ సంకల్పము గాని కల్గినా అది క్రియారూపము దాల్చదు. సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థము కవచమువలె కాపాడుతుంది. కాబట్టి దాని ద్వారా ఏ రకమైన కర్మ అంటదు. గురుబిడ్డ అయినవాడు ఇటువంటి తప్పులు ఒకటి రెండు పర్యాయాలు చేసినా సద్గురుమూర్తి చేసిన హెచ్చరికలను గుర్తించి తప్పును సరిదిద్దుకొనే అవకాశము ఉంది.

ఇక్కడ మీకొక ఉదంతం చెపుతాను. కురుక్షేత్ర సంగ్రామం ప్రారంభం కావలసిఉంది. అర్జునుడు తన బంధువులతో యుద్ధము చేయవలసి వచ్చినందుకు విచార సాగరములోమునిగియున్న తరుణంలో శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతను బోధించాడు. ఆ సమయంలో అర్జునునికి అనేక సంశయాలు కల్గాయి. శ్రీకృష్ణ పరమాత్ముడు గీతాచార్యుడై అర్జునుని సందేహాలు అన్నీ తీర్చగలిగాడు.

భగవద్గీత బోధ జరుగుతుండగా అర్జునుని రథముపై నున్న కపిరాజు దిగివచ్చి శ్రీకృష్ణ భగవానుని ఎదురుగా నిలుచుని సమాధానం చెప్పబోయాడు. శ్రీకృష్ణ పరమాత్ముడు అక్కడ సద్గురుమూర్తిగా హనుమని అడగని ప్రశ్నకు సమాధానం చెప్పటానికి ప్రయత్నం చేసినందుకు పిశాచ రూపాన్ని ధరించమని ఆజ్ఞాపించాడు. చూశారా గురు శిక్షణ ఎలా ఉంటుందో!

పిశాచ రూపధారణచేసి పాపకర్మ అనుభవించే జీవులకు గీతను బోధించి వారికి పిశాచ రూపమునుండి విముక్తిని ప్రసాదించే బాధ్యతను హనుమకి శ్రీ కృష్ణభగవానుడు అప్పగించారు. భగవంతుని లీలలు ఎవరు అర్థంచేసుకోగల్గుతారు?

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## గురువు ఎంత మంచివారు!

"గురువెంతో మంచివారు, గురుతులెన్నో తెలిపినారు
అరమరయూ లేక నన్ను హరిచెంతకు చేర్చినారు
1. మూడు గుణంబులను - మొదలంటా నరికినారు
మూటికినీ సాక్షియైన - ముక్తిని చూపించినారు
2. షట్చక్రముల మధ్య - సందులను తెలిపినారు
సందూ గొందూలు నిండి - సాక్షాత్కరించినారు
3. ఎన్నెన్నో తెలిపినారు - ఎవ్వరికీ సాటిరారు
మరచిననూ మరపురారు - మహానుభావులేను"

(పై కీర్తనను పాడి శ్రీమాతాజీ బోధ చేశారు)

గురువుల దగ్గర మనం అందుకోలేనివి, గొప్పవి కొన్ని ఉంటాయి. వారెంత గొప్పవారు అనేది మాటలలో చెప్పలేము. ఈ గురుకీర్తన పాడితే గురుదేవులు ఎంతో ఆనందించేవారు. కానీ, మనం మనస్సుపెట్టి పాడి తీరాలి. ఆరారు తత్త్వాలకీ ఆవల ఉండేది గురుతత్త్వం. దానిని ఆధారం చేసుకునే ప్రపంచమంతా ప్రకాశిస్తోంది.

ప్రపంచంలోని ఏ బంధుత్వం తీసుకున్నా అరమరికలుంటాయి. కానీ గురువుల దగ్గర మాత్రం వ్యవహారం లేదు. భక్తులకి తమని తాము ధార పోసుకున్నారు. దేవుళ్ళు మన కోరికలు తీర్చవచ్చు. కాని గురువులు మనని ఉన్నత స్థితికి తీసుకు వెళ్తారు. వారు మనని తరింపజేయడానికి వచ్చిన మహానుభావులు. **'Why Fear? I am here!'** 'ఎందుకు భయం? ఇచ్చాను అభయం!' అని అభయమిచ్చారు స్వామి. అది జపం చేసుకునే మంత్రం కాదు. అది మనం మనసారా, హృదయంనిండా అనుభవించాలి. అది 'సూచన' అంటారు. ఉదాహరణకు డాక్టర్లు 'నీవు కాలు అలా పెట్టకుండా, ఇలా పెడితే తగ్గుతుంది' అని చెప్తారు. అది సూచన. దానిని ఆచరిస్తే నీకు ఉపకరిస్తుంది. 'నొప్పి మళ్ళీ వస్తుందా?' అని మీరు అడిగారు అనుకోండి, మీరు లోకువ ఇస్తే అది మళ్ళీ వస్తుంది!

గురువులు అరమరికలు లేకుండా మనలను హరిచెంతకు చేరుస్తున్నారు. మేము ఈ కీర్తనను పాడేటప్పుడు 'హరి'కి బదులుగా 'గురు' అనిగాని, 'తమచెంతకు' అనిగాని మార్చి పాడితే, కొబ్బరికాయలు

వచ్చి మీద పడేవి! "ఏం! హరి, గురువు ఒకటి కాదా? నాగార్జున సాగర్ డాముకి వెంట్రుకవాసంత బీట చాలదా కూలిపోవడానికి? ఈ లోపం చాలు మీ సాధన పాడయిపోవటానికి" అని హెచ్చరించేవారు.

సత్వ, రజో, తమో గుణములని కూకటి వేళ్లతో లాగిపారవేసి, ఈ మూడింటికీ సాక్షియైన ముక్తిని ప్రసాదిస్తారు గురుదేవులు. మనందరం ఇక్కడ శ్రీగురుదేవుల సన్నిధిలో కూర్చుని ధ్యానం చేస్తున్నామంటే, ఎవరిని గురించి ధ్యానం చేస్తున్నాము? కళ్లు తెరిస్తే విషయాదులు గుర్తుకు రాకపోతే, కళ్లు తెరిచి ఉన్నా, అది ధ్యానమే అవుతుంది. నిత్యానిత్య వస్తు వివేక దృష్టి కలిగి ఉండటం ముఖ్యం. ఎదురుగా ఒక గొయ్యి ఉంటేనో, తడి ఉంటేనో దానిని తప్పించి దాటి వెళతాం. ఈ డెసిషన్ ఎంతలో తీసుకున్నాం? కేవలం ఒక్క క్షణకాలంలో. అటువంటి విచారణ భగవంతునివైపు త్రిప్పాలి. ధ్యానం చేసే టైములో ఇతరత్రా ఆలోచనలు వస్తే, 'ఈ విచారణ నీకు అవసరమా? ఇది నిన్ను తరింపజేస్తుందా?' అని మీ మనస్సును మీరు గద్దించి అడగాలి. ఇదే ధ్యాన ప్రయత్నం అంటే. ఇది మీకు లైబ్రరీలలోనూ, హోటళ్లలోనూ రాదు. ఇది కేవలం సజ్జన సాంగత్యం వల్ల మాత్రమే వస్తుంది.

ఈ దేహం సత్యం అనుకుంటున్నాం. ఈ దేహం నీవు కాదు అని మూల మూలలా వెదకి చూపిస్తున్నారు మహాత్ములు. షట్చక్రముల మధ్య సందులను తెలిపినారు - షట్చక్రాల మధ్య ఏముంది? భౌతికంగా మీరు ఆలోచిస్తే, నరాలు నలిగిపోవటమే. ఈ దేహం మీదే మనస్సు పెడితే నొప్పులు ఎక్కువైపోతాయి. దైవం మీద పెడితే యోగం అవుతుంది. షట్చక్రాల మధ్య సందులు భిన్నం కాదు. అవి కూడా షట్చక్రాలవే. సందు గొందులు నిండి సాక్షాత్కరించినది ఎవరు? ఆ గురు పరబ్రహ్మమే.

ఈ సృష్టి అంతా భగవంతుడిదే. ఈశ్వర సృష్టిని మార్చలేము కనుక దృష్టిని మార్చుకోవాలి. ఇటువంటి మెలకువలను ఎన్నో తెలిపారు. గురుతత్త్వాన్ని మించినది ఏదీ లేదు. గురుతత్త్వానికి సాటి ఎవరూ రాలేరు. వారు మన మనస్సు మీద చెరగని ముద్ర వేస్తారు. అందుకే మరచి పోదామన్నా వారు మరపురారు. తమని తాము ఎవ్వరూ మరచిపోరు. కనుకనే అందరిలోనూ 'నేను' అయి కూర్చున్నారాయన.

(తరువాయి భాగం కోసం 30వ పేజీ చూడండి)

# సద్గురు సమాశ్రయం గుణరహితం

- మైలవరపు సుశీల

అహంకారం చాల చెడ్డది. ఎంతటి పండితుడైనా సాధకుడైనా దానికి దాస్యం చేస్తే పతనం తప్పదు. అయితే పుణ్య కర్మాచరణ ద్వారా ఆర్జించిన పుణ్యఫలము మనస్సు గాడితప్పి వక్రమార్గంలో పోకుండా దిశను సరిదిద్దే అవకాశం ఉంది. గుణసహితుడు అయినంత మాత్రాన ప్రమాదం లేదుకాని, గుణహీనుడు కాకూడదు.

అహంకారమనే కాదు, ఏ గుణానికి దాసుడుకాకుండా ఉండాలంటే సద్గురుమూర్తి సమాశ్రయం చేకూరాలి. అది లభిస్తే అన్ని సమస్యలు పరిష్కరింపబడి సాధకుడు సునాయాసంగా గమ్యం చేరవచ్చు. అది లభ్యం కానప్పుడు మనస్సు చిందులు వేయక తప్పదు. ఎంతటి యోగులైనా ఆ ఫలితాన్ని అనుభవించక తప్పదు. మన పురాణాలు, ఇతిహాసాలు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

పూర్వం జాజలి అనే ముని తాను నివసించే గ్రామంలో ఎన్నో యాగాలు, యజ్ఞాలు నిర్వహించటమే కాక, సమయం దొరికినప్పుడల్లా తపస్సు చేసుకునేవాడు. సగుణ సంపన్నుడే కాని గుణరహితుడు కాదు. యాదృచ్ఛకమో లేక దురదృష్టమో గాని ఆయనకు సద్గురు సమాశ్రయం కలుగలేదు. కాల నిర్ణయ ప్రకారం ఆయన నిర్జన ప్రదేశంలో కూర్చుని తపస్సు చేసుకునే వాడు. తైల సంస్కారం లేని కారణంగా శిరోజాలు జడలుకట్టి వ్రేలాడుతున్నాయి.

ఆయన ఊహించని విధంగా ఆ నిర్జన ప్రదేశంలో పిచ్చుకలు ఆయన శిరస్సుపై వ్రాలటం, కిలకిలారవములు చేస్తూ ఎగిరిపోవటం జరుగుతోంది. ఆ ముని సగుణ సంపన్నుడే కాబట్టి, పిచ్చుకలు ఆయన శిరస్సును స్థావరంగా చేసుకున్నందుకు ఆనందిస్తూ తన కార్యక్రమంలో నిమగ్నమై ఉండేవాడు.

ఆ కథ అంతటితో ముగియలేదు. ఆ పిచ్చుకలు ఆయన శిరస్సు పైన గూడు కట్టుకుని గ్రుడ్లు పెట్టి, పొదిగి పిల్లలను చేసేవరకు ఆ కార్యక్రమం కొనసాగింది. ఆయన అంతర్గతంగా ఆ పిచ్చుకల చర్యకు ఆనందిస్తూ 'నా వలన కదా ఈ పిచ్చుకలు ఇలా ఆనందంగా జీవించ గలుగుతున్నాయి' అని తన త్యాగశీలతకు తనలో తాను ఉప్పొంగిపోయి

తనలో దాగి ఉన్న అహంకారము బహిర్గతమైనది. మరి దానిని దేవతలు సహిస్తారా! మునికి వినబడేటట్లుగా అశరీరవాణి పలుకుతూ "మునివర్యా మీరు ఏదో కార్యం సాధించానని భావిస్తున్నారు. అది మీలో దాగి ఉన్న అహంకారానికి నిదర్శనం. మిమ్మల్ని మించిన భక్తులు, త్యాగశీలురు ఉన్నారు. ఈ ప్రక్క గ్రామంలోనే తులాధరుడు అనే వర్తకుడు ఉన్నాడు. ఆయనను దర్శించి తెలుసుకోండి" అన్న మాటలు వినిపించాయి.

జాజలి ముని బయలుదేరి వెళ్ళి తులాధరుడిని దర్శించి ఆశ్చర్య పోయాడు. "తులాధరుడు కేవలం వర్తకుడు. వ్యాపారం చేసుకనే వాడు భక్తుడు ఎలా అవుతాడు? ఈయనలో త్యాగశీలత కనబడదేమిటి? కర్మను ఆచరించే ఈ వర్తకుడు ఫలితం పొందుతాడు కదా!" అని మనస్సులో ఊహించేలోపుగా తులాధరుడు మాట్లాడుతూ, జాజలి పిచ్చుకలకు ఆశ్రయం ఇచ్చిన విషయమే కాక, తాను అంతర్గతంగా చేసే భావనలకి కూడా సమాధానం చెప్పాడు.

"మునివర్యా! పిచ్చుకలకు ఆశ్రయం ఇవ్వటం చెప్పుకోదగ్గ విషయమే. కానీ మీలో కర్తృత్వ భావన ఎంతవరకు మెచ్చుకో దగినదది? అంతేకాదు కర్మచేయటం తప్పు కాదు. కర్మ చేయవద్దని ఏ శాస్త్రము చెప్పటం లేదు. కర్తవ్య నిర్వహణ తప్పుకాదు. కర్తృత్వ భావన తప్పు. అంతేకాదు మీరు నిర్వహించిన యజ్ఞయాగాదులు, మీ తపస్సు మీకు పుణ్యఫలాన్ని ఆర్జించిపెట్టాయి. అయితే అవి ధర్మదేవత పరీక్షకు ఎంతవరకు నిలబడతాయి? ధర్మదేవత భటులే పిచ్చుకల రూపంలో వచ్చి మీ ఆశ్రయాన్ని కోరాయి" అనేసరికి పిచ్చుకలన్నీ తమ యదార్థ రూపాన్ని ధరించి, మునికి దర్శనం ఇచ్చాయి.

తులాధరుడు ఇంకా మాట్లాడుతూ "మునివర్యా! మీరు సంస్కార వంతులే. మీలో దాగిఉన్న అహంకార బీజము రహితమవ్వాలంటే మీరు సద్గురుమూర్తిని ఆశ్రయించాలి. అలా చేస్తే మీరు తప్పక గమ్యాన్ని చేరుకో గలుగుతారు" అని చెప్పి ఆ పిచ్చుకలు, తులాధరుడు కూడా అంతర్ధానం అయ్యారు. జాజలి ముని అదృష్టం పండి, సద్గురుసమాశ్రయం కలిగి ధన్యత్వాన్ని పొందాడు.

# కొప్పు లింగేశ్వరుడు

ద్రాక్షారామ దేవాలయాలలో పలివెల కొప్పులింగేశ్వరాలయం ముఖ్యమైనది. మొదట్లో ఈ కొప్పులింగేశ్వరుణ్ణి 'అగస్త్యేశ్వరుడు' అని పిలిచేవారు. అంటే అగస్త్యమహర్షి ప్రతిష్ఠించిన లింగమే అగస్త్యేశ్వరుడు.ఆ తరువాత ఒక పరమ అద్భుతమహిమ వల్ల ఈ అగస్త్యేశ్వరునికి కొప్పు లింగేశ్వరుడు అనే పేరు వచ్చింది.

ఆ ఆలయంలో ఒక పూజారి ఉండేవాడు. అతడు యువకుడు. ఎంతటి భక్తుడో అంతటి వేశ్యాలోలుడు. ఇతని వేశ్యాలోలత్వం ఆ ఊరి ప్రజలకు సహింపరానిదిగా అయింది. ఎలాగైనా సరే అతనిని దేవాలయం లోనుండి బయటకు పంపాలని నిర్ణయించుకున్నారు. కాకపోతే వేశ్యా దాసుడు, ఈశ్వరదాసుడిగా ఎలా ఉంటాడు?

పెద్దలు అతనిని అనేక విధాలుగా మందలించారు. బుద్ధులు చెప్పారు. కాని ప్రయోజనం లేకపోయింది. ఇక ఆ రాజుగారికి ఫిర్యాదు చేశారు. ఇతణ్ణి శిక్షించవలసినదని అర్థించారు.

ఒకరోజు మధ్యాహ్నం హఠాత్తుగా రాజుగారు అగస్త్యేశ్వర స్వామి దర్శనానికి వచ్చారు. సరిగా ఆ సమయంలో ఆ పూజారి గృహంలో వేశ్యతో ముచ్చటలాడుతున్నాడు. ఈలోగా రాజుగారు వచ్చారనే వార్తను విని ఖంగారు పడ్డాడు. సాంప్రదాయాన్ని అనుసరించి, రాజుగారికి ఈశ్వరునికి అలంకరించిన మాలను సమర్పించాలి. దీనినే నిర్మాల్యం అంటారు. ఆలయంలో ఈశ్వరుడికి మాల ఉన్నదో లేదో అనే అనుమానం వచ్చి, వేశ్య కొప్పున ఉన్న మాలనే తీసుకుని దేవాలయానికి పరుగెత్తాడు.

రాజుగారికి ఆలయ మర్యాదలుచేసి, పరమేశ్వరుని పాదుకలు ఆయన తలపై పెట్టి, ఈ మాలను ఆయన చేతిలో పెట్టాడు. చుట్టూ ఉన్న ప్రజలు నిర్మాల్యాన్ని జాగ్రత్తగా పరిశీలించారు. దొంగ దొరికిపోయాడు! ఆ మాలలో ఒక పొడవైన వెంట్రుక ఉన్నది. వెంటనే వారంతా కలిసి "ఇదిగో చూడండి! ఇది ఈశ్వరుడు ధరించిన మాల కాదు, వేశ్య ధరించినది. కాకపోతే ఈ మాలలో ఈ పొడవైన వెంట్రుక ఎలా వస్తుంది?" అని ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు.

రాజు ఆ పూజారి వంక ఉగ్రంగా చూస్తూ "దీనికి నీ సమాధానం

ఏమిటి?" అని ప్రశ్నించాడు. దానికి ఆ పూజారి "మహారాజా! ఇది నిజంగా ఈశ్వరుడి మాలే. సందేహం లేదు. మన ఈశ్వరుడు కొప్పులింగేశ్వరుడు. ఆయనకు పెద్ద జడ ఉంది. ఆ జడలోని వెంట్రుక ఇది. ఈశ్వరుడు ధూర్జటి కదా!" అన్నాడు. రాజుతో సహా అందరూ ఆశ్చర్యపోయారు! 'ఏమి దుస్సాహసం!' అన్నారు. 'అలా అయితే ఇప్పుడే ఈశ్వరుడి కొప్పు చూపించు' అని రాజు ఆజ్ఞాపించాడు.

"రాజా! ఈశ్వరుడికి అభిషేకంచేసి, గంధపుష్పాదులతో పూజించి, నాగాభరణ భూషితుణ్ణి చేశాను. ఇప్పుడు స్వామిని తాకటానికి కుదరదు. రేపు ఉదయం నిర్మాల్యం తీసేవరకు మీరు వేచి ఉండవలసిదే" అన్నాడు పూజారి. రాజు అసలు విషయం తెల్సుకోవాలని 'సరే' అన్నాడు. మరునాటి ఉదయం ప్రజలంతా జన సముద్రంలా పోగయ్యారు.

పూజారి మెల్లగా నాగాభరణం, నిర్మాల్యం తొలగించి ఈశ్వరుడి నిజరూపాన్ని చూపించాడు. ఆశ్చర్యం! పరమేశ్వరుని శిరస్సుపై పెద్దజడ ఉంది. అర్చకుడి నేత్రాలు ఆనంద ప్రవాహాలు! రాజుతో సహా ప్రజలంతా ఆశ్చర్య సముద్రంలో మునిగి తేలారు! వెంటనే "ఇదంతా దగా! కుట్ర! మోసం! రాత్రికి రాత్రి ఈశ్వరుడికి జడ అతికించాడు" అంటూ ప్రజలు అరుపులు కేకలు పెట్టసాగారు. రాజు మెల్లగా గర్భగుడిలో ప్రవేశించి, పరీక్షించటానికి వెంట్రుక పట్టుకు లాగాడు. రక్తం చిమ్మింది. ఆ క్షణంలోనే రాజుగారికి కంటి చూపు పోయింది.

వెంటనే మహారాజు "ఈశ్వరా! నా ఈ అపరాధాన్ని మన్నించు. ఈ పూజారి పరమభక్తుడు!" అంటూ అర్థించాడు. ఈశ్వరానుగ్రహంతో రాజుగారికి వెంటనే చూపు వచ్చింది.

నిజానికి అగస్త్యేశ్వరుడు కొప్పులింగేశ్వరుడు కాదు. ఆయనకు శిరస్సుపై జడలేదు. ఆ రాత్రి పూజారి తనను రక్షించవలసినదని, నెత్తిపై కొప్పు తెప్పించుకోవలసినదిగా ప్రార్థించాడు పరమేశ్వరుణ్ణి. ఆ భక్తవత్సలుడు అర్ధనారీశ్వరుడు, తన భక్తుణ్ణి కాపాడటానికి కొప్పులింగేశ్వరుడు అయ్యాడు.

ఆ రాజు 30 పుట్ల భూమిని దానం చేశాడు. ఈ భూమి ఇప్పటికి 'జుత్తిగపాడు' అనే పేరుతో పిలవబడుతోంది.

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

25-12-85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "బృందావనం బహు సుందరమైనది. అత్యంత మనోహరమైనది. ఎందువలన అంటే సర్వసృష్టిని ప్రకాశింపచేసే పరమాత్ముడు అక్కడ సాకారంగా సంచరించాడు కాబట్టి. ఆయన ప్రేమలో హెచ్చుతగ్గులు ఉంటాయా అండీ అవధాన్లుగారూ?" అని ప్రశ్నించారు. 'ఉండవు' అని ఆయన సమాధానం చెప్పారు. శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "ఆయన మురళీనాదానికి నెమళ్ళు పురివిప్పి నాట్యం చేసేవి. సర్పములు పడగవిప్పి నృత్యం చేసేవి. భృంగములు నిరంతరము ప్రణవనాదాన్ని ఝుంకారము చేస్తూ ఉండేవి. ఇంక గోపికలు నిరంతరము కృష్ణనామం స్మరించేవారు. యమునానది ఆయన పాదస్పర్శతో తదాకారాన్ని పొంది ఈ నాటికీ నీలి రంగులోనే ఉంటుంది.



సూర్యకాంతిలో హెచ్చుతగ్గులు ఉంటాయా? ధనవంతుడికి ఎక్కువ కాంతి బీదవాడికి తక్కువ కాంతి ఇవ్వాలి అనే భేదం చూపుతున్నాడా? అలాగే గంగానది ధనవంతుడికి పవిత్రజలాన్ని బీదవాడికి మురికి జలాన్ని అందించి తేడా చూపిస్తోందా! వీడు శుంఠ వాడు అశుంఠ అనే భేదాన్ని ఎవరైతే చూస్తారో వారే నిజమైన శుంఠలు. అంటే అజ్ఞానులు అన్నమాట. గృహస్థాశ్రమంలో ఉన్నవారు స్వధర్మాన్ని ఆచరించి కర్మచేయాలి. ఫలితాన్ని ఆశించకూడదు. ఏది లభిస్తే దానిని పొంది తృప్తిపడాలి. నీకు లభించిన పైకాన్ని నీ దారాపుత్రాదులకి వినియోగించు. మిగిలిన దానిని దుర్వినియోగం చేయకు. నీకు లభించిన ధనాన్ని గాని నీకు ఇచ్చిన శక్తిని గాని దుర్వినియోగం చేస్తే దాని ద్వారా ఆర్జించిన కర్మ నిన్ను సంకటములకు గురిచేస్తుంది. ఆ స్థితిలో 'మీకు Problems ఎక్కడ నుంచి వచ్చాయి? ఎందుకు వచ్చాయి?' అని మీ మిత్రులు అంటారు. కాబట్టి ఇటువంటి స్థితినుండి రక్షింపబడాలి

అంటే నువ్వు ఏ కర్మ ఆచరించినా, మనస్సు భగవంతుని యందు నిలిపి చేయి. అప్పుడు అది కర్మలో అకర్మ అవుతుంది. తోటి మానవునికి సహాయం చేయి. అది చేతకాకపోతే అపకారం చేయకు. అదికూడ చేతకాకపోతే ఆ జీవుడిని రక్షించమని భగవంతుని ప్రార్థించు. ఆ ప్రార్థన నిత్యకాలంలో జమ అవుతుంది. అంతేకాని భగవంతుని పొందటానికి ముక్కు మూసుకుని కూర్చోమని కాని, సన్యసించమని కాని, జడలు పెంచమని కాని, కొండగుహలో కూర్చోమని కాని చెప్పలేదు. భార్యాబిడ్డల మీద కోపంతోనో, అప్పుల బాధపడలేకనో సన్యసించి కొండగుహలో కెళ్ళి కూర్చుంటే కొంతకాలానికి మనస్సు మరలి భ్రష్టుడవుతాడు. సన్యసించవలసింది మనస్సు, అంతేకాని వేషం కాదు.

సోమరితనం అంటువ్యాధిలాంటిది. అది మొలగజ్జిలాంటిది. దానిని వదిలించుకోవటం చాలా కష్టం. గోకినచోటే గోకమంటుంది. గోకితే మంట, గోకకపోతే తంట. ఇటువంటి సోమరి దుర్జనుని కన్నా ప్రమాదం. కాబట్టి అటువంటి వారికి దూరంగా ఉండాలి. Time కి ఆఫీసుకి వెళ్ళాలి. ఆఫీసులో కునికిపాట్లు పడకూడదు. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు 'ఓం' అని ప్రణవాన్ని పూరించండి. లేకపోతే మధ్యలో లంచ్ Time ఉంటుంది కదా అప్పుడు 'ఓం' అని నామం చేస్తూ తినండి. త్రాగండి. అది మీరు స్వీకరించే దాంట్లో కలుషాన్ని హరిస్తుంది.

సిగరెట్టు కాలుస్తూ కూడ 'ఓం' అంటూ నామం చేస్తే కలుషాన్ని హరించి రోగ విముక్తుడిని చేస్తానంటున్నాడు భగవానుడు. అలా చేయగా చేయగా అది కొబ్బరి పువ్వు పెరిగినట్లు పెరిగి సాధన అయి నిన్ను ఆయన మనస్సులో నిలుపుతాడు. లేకపోతే ఆయన నీ మనస్సులో నిలుస్తాడు. అప్పుడు జపతపము లేల? నీ కుటుంబ సభ్యుల మధ్య ఉన్న కలతలు తొలగిపోయి అశాంతిని పోగొట్టి ఒకరినొకరు ప్రేమించుకోగలుగుతారు. ఒక కుటుంబంలో రాక్షస ప్రవృత్తి కలిగియున్న వాడివల్ల ఆ కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా అశాంతి కలగుతుంది. ఆ రాక్షస ప్రవృత్తిని పరమాత్మశక్తి తొలగిస్తుంది. అప్పుడే వాడు మనీషి అనిపించుకుంటాడు. మనుష్యత్వం, ముముక్షత్వం, మహాత్ముల సమాశ్రయం దొరికినందుకు మీ జన్మని సార్థకం చేసుకోండి అని మీ హృదయ బాబు హెచ్చరిస్తున్నాడు" అన్నారు.

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

“ఈ జీవితంలో కష్టపరంపర నొకదాని తర్వాత మరొక దానిని ఎదొర్కొంటున్నా, మనము బాధాకరమైన యీ క్షణిక జీవితముపై సిగ్గనేది లేకుండా, విరక్తి చెందటములేదు. మనము, యీ జగత్తులో అన్ని వస్తువులు నశించేవని తెలిసికూడ, నాశరహితమైన దానికై కృషి చేయుటలేదు. అజ్ఞానులు ప్రాయములో ఉన్నప్పుడు రోజు యెన్నో దారుణమైన పాప కార్యాలు చేస్తున్నారు. , అజ్ఞానములో కూరుకు పోతున్నారు.



యుక్త వయసు రాగానే, కామానికిలోనై, స్త్రీ ప్రలోభమునకు దాసుడు అవుతున్నాడు, వృద్ధాప్యములో మానవుడు కుటుంబ భారంతో క్రుంగిపోతున్నాడు. సంసార భారములతో కూరుకుపోయి, బాధ, వ్యధకు లోనై, అస్తమిస్తున్నారు, ఇక వారికి సత్కార్యములు చేయటానికి, భగవారాధన చేయటానికి సమయమెక్కడ వున్నది?

మనము నిరంతరమూ మిగతా వాటికంటే యెక్కువ ఆనందము, యెక్కువ మన్నిక వున్నవాటికై శోధన చేస్తుంటామే కాని, ప్రాపంచిక చింతలకతీతమై, నాశరహితమైన పరమాత్మకై శోధన చేయము. కమలనయనాల వాలు చూపులతో ఆకర్షించే స్త్రీల ఆకర్షణ త్వరగా వాడిపోతుంది, వారు మట్టిలో కలిసిపోతారు. ఒక కంటిమెరుపు కాలంలో, అనేక మంది బ్రహ్మ, విష్ణువులు సృజింపబడి నశిస్తుంటే, వారి ముందు, అత్యంత స్వల్పమైన నేనంత? జ్ఞానులు యీ ప్రపంచాన్ని, అనంతమైన దుఃఖసాగరముతో పోల్చారు. అలాంటప్పడు ఎవరైనా యిక్కడానందమును పొందగలమని, ఎలా ఆశిస్తారు?

“ఈ సంసారమనే వృక్షమునకు, మనసు మూలమైన వేరు వంటిది. అది కొమ్మలతో, రెమ్మలతో, పుష్పాలు, పిందెలు, ఫలాలతో, అన్ని వైపులకు విస్తరిస్తున్నది. ఈ మాయ యెలా వచ్చింది? ఈ మనసు సంకల్పమని పిలువబడే ప్రపంచమనే ప్రదర్శనశాలలో నృత్యము

చేస్తున్నది, మనసు సంకల్పాల సమూహము, సంకల్పాలను నిర్మూలంచేస్తే, జనన, మరణ మనే వృక్షము కూడ, అంతరిస్తుంది. నా ఆత్మ యనే ముత్యాన్ని దోపిడి చేసిన దొంగను నేను కనుక్కొన్నాను, నేనిప్పడు జాగరూకుడనయ్యాను, నా ఆత్మను దోచుకొన్న చోరుని, వెదకి పట్టుకొన్నాను. అతని పేరు మనసు ఈ క్రూరుడైన దోషి వలన నేనింత కాలము బాధపడుతున్నాను. నేనింక యీ మనసు చేత మోసగింప బడటానికాస్కారమివ్వను దానిని సంహరించటానికి, నిశ్చయించు కొన్నాను, నేను వివేచనా శక్తి యనే సూదితో గుచ్చి, ఆత్మ నిగ్రహము, వైరాగ్యమనే సుగుణాలతో కూర్చిన మాలగా చేస్తాను. నేనిప్పడు ఆత్మ జ్ఞానముతో మేలుకొన్న వాడినై, నా ఆధ్యాత్మిక కృషిని కొనసాగిస్తాను. నేనిప్పడు చాలా కాలంగా కోల్పోయిన ఆత్మను కనుగొన్నాను, ఇక పవిత్రమై, నిత్యమైన ఆత్మయందే, దృష్టి కేంద్రీకరించి, పరమశాంతిని పొందుతాను. నాకు ప్రబల శత్రువైన మనసును లొంగదీసుకొని, "ఇది నా శరీరం", "యీ ఆస్తులు, సంపద నావి" యనే భావాలకు తిలోదకాలిస్తాను".

"సదా ఆత్మను మథించే సిద్ధగీతను శ్రద్ధగా విన్న తర్వాత నేను అనేకాధ్యాత్మిక అనుభూతులను సాధించాను ఆ సిద్ధులను నా గురువులుగా భావిస్తాను. నా మనసును పూర్తిగా నిర్మూలించాను, సత్యము, నిత్యమైన పరమానందమును నేనిప్పడు, అనుభవిస్తున్నాను, నేనిప్పడు సంపూర్తిగా అన్ని బాధలు, దుఃఖాల నుండి విముక్తుడ నయినాను. ద్వంద్వాలు, భేదాలు, హెచ్చుతగ్గులనేవి, అంతరించాయి నేనిప్పడు నిత్యశాంతుడనై, పరమాత్మనే సర్వత్రా దర్శిస్తున్నాను.

నేను, నీవు, వాడు, ఇక్కడ, అక్కడ, యిప్పడు, అప్పడు, అనే భావాలు అదృశ్యమయినవి, నా అజ్ఞానాన్ని నశింపచేసి, నన్ను వుదాత్తస్థితికి చేర్చిన, ఆత్మ జ్ఞానమునారాధిస్తున్నాను."

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

జూన్ 2015

02 మంగళ : జ్యేష్ఠ పౌర్ణమి, శ్రీ సద్గురుపాదపూజ.

11 గురు : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

15 సోమ : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం.

16 మంగళ : అమావాస్య

జులై 2015

2 గురు : (అధిక ఆషాఢ) పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ

11 శని : శ్రీ గురుదశమి - సత్సంగ సమావేశము, శ్రీసద్గురు పాదపూజ

14 మంగళ : మాసశివరాత్రి, గోదావరి పుష్కర ప్రారంభం.

16 గురు : అమావాస్య

17 శుక్ర : దక్షిణాయనం

27 సోమ : తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

31 శుక్ర: నిజ ఆషాఢపౌర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, చాతుర్మాస్య దీక్ష ప్రారంభం.

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

'తత్త్వం' అంటే ఏమిటి? అని ప్రశ్నించగానే సాధకులంతా తికమక పడటం సహజం. 'తత్' అంటే 'అది'; 'త్వం' అంటే 'నీవు'. నీవెవరవో తెలియం జేసేదే తత్త్వం. దానిని తెలియజేయగలవారెవరు? సద్గురుమూర్తి మినహా మిగతా వారికి అసాధ్యం.



సాధకులకు ఉపదేశవాక్యంగా తత్త్వమసి అనే మహావాక్యాన్ని ఉపదేశిస్తారు. అది అనుష్ఠానం చేసేది కాదు. బ్రహ్మం ఎక్కడ? ఎక్కడ? అని వెదుకులాడే సాధకులకు ఆ అవ్యక్తమైన, అచింత్యమైన, అనంతమైన బ్రహ్మవు నీవే అని ఉపదేశిస్తారు. అంతమాత్రం చేత సాధకుడు తెలుసుకో గలుగుతాడా? అడ్రసు ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తిని కలుసుకోగలుగుతావా?

అన్వేషణ చేయాలి కదా! గురూపదేశం పొందిన తరువాత 'నేను బ్రహ్మను ఎలా అయ్యాను? అసలు నేను ఎవరు? అనే విచారణ చేయాలి. విచారణ చేయాలంటే శ్రవణము, మననము చేయాలి. శ్రవణ మననాదుల ద్వారా కలిగిన జ్ఞానము విచారణ ద్వారా అనుభూతిని ప్రసాదిస్తుంది.

ఉపనిషత్ 'బ్రహ్మ సత్యం, జ్ఞానం, అనంతం' అని వివరిస్తోంది. మూడు లక్షణాలతో కూడిన బ్రహ్మ అఖండం ఎలా అయిందని విచారణ చేయాలి. సత్యమైనదే జ్ఞానం. మరి జ్ఞానం అనంతం కాబట్టి సత్యమైన బ్రహ్మమే జ్ఞానం, అది అనంతమైనది అని గ్రహించగలుగుతావు.

అలా విచారణ చేయగా, చేయగా 'బ్రహ్మవిదాప్నోతి

పరమ్' అని ఉపనిషత్తు చెప్పినట్లుగా బ్రహ్మవేత్తవై బ్రహ్మానుభూతిని పొందుతావు. అక్కడ పొందే వాడు, పొందేది వేరుగా లేవు. తలంపు లేక సంకల్పము. ద్రష్ట దాని భావన దృశ్యము. ద్రష్ట ఉంటే దృశ్యము ఉంటుంది.

ఆత్మ అనేది అనుభూతి. అనుభూతిలో తలంపు లేదు, భావన లేదు. సద్గురుదేవులు భక్తులను ప్రశ్నిస్తూ "తోటి భక్తులను నన్ను గౌరవించినట్లు గౌరవించగలరా? అదే నిజమైన జ్ఞానదృష్టి. సర్వవ్యాపకత్వాన్ని గుర్తించటం అంటే అదే. నిర్గుణతత్త్వం అన్నా అదే.

భగవంతుడిని అందరూ పూజిస్తారు. సహజమే. తోటి భక్తులను అదే భావనతో చూడగలగాలి. నిన్ను గుణరహితుడు అవ్వమని కోరటం లేదు. సగుణ సంపన్నుడవు కావాలని మీ హృదయబాబు కోరుకుంటున్నాడు.

అది అసాధ్యం కాదుకదా! దానిని సాధించగలిగినప్పుడే సద్గురుమూర్తికి ఆనందం. అవ్యక్తంగా ఉండే నిరుపాధిక బ్రహ్మము ఉపాధితో కూడిన సోపాధిక బ్రహ్మముతో విభేధనము కలిగి ఉన్నట్లు అనిపించటమే అజ్ఞానము. ఈ చిక్కుముడి నుంచి బయట పడటమే జ్ఞానము. అదే 'తత్త్వమసి' ఉపదేశ వాక్యార్థము" అన్నారు.

# మౌనమేలనో స్వామి

- పెనుమాక నాగేశ్వరరావు

మౌనమేలనో స్వామి, నేనోపలేను స్వామి
కల్లబొల్లి మాటలేవీ ఎరుగనయ్యా
అల్లిబిల్లి ఆటలేవీ తెలియవయ్యా
నోములేవీ నోచలేదు స్వామి
ఆ తలపులేవీ తోచలేదు బాబూ ॥మౌన॥

తప్పులెంచకయ్యా, తట్టుకోజాలనయ్యా
మంత్రతంత్రాలు పలుకలేను
కుట్రకుతంత్రాలు సేయలేను
మనసులోని మాట తెలుపుచుంటి మౌనమేల ॥మౌన॥

దారితెన్ను తెలియకుంటి
నీ దయ ఒక్కటుంటే చాలునంటి
నీ పాదమంటి నే నిక్కమునే పలుకుచుంటి
నిన్ను నమ్మి కొల్చుచుంటి
మీ చరణమంటి శరణమంటి ॥మౌన॥



(గత సంచిక తరువాయి) # గీతాధ్యయనమ్ - రమణ ప్రసాద్

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం, తత్పర స్సంయతేంద్రియః।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిం, అచిరేణాధి గచ్ఛతి ॥ 39

శ్రద్ధ, ఇంద్రియ నిగ్రహం కలవాడు ఈ జ్ఞానాన్ని పొందుతాడు. అతనికి జ్ఞానం కలిగిన వెంటనే పరమశాంతి వస్తుంది. నిష్కామకర్మ చేసి, కర్మఫలం విడిచి, జ్ఞానంతో సంశయం పోగొట్టుకున్నవాడు పరమ శాంతిని పొందుతాడు. అతనిని కర్మలు బంధించవు.



కాబట్టి అర్జునా! నువ్వు నీ సందేహాలను జ్ఞానఖడ్గంతో నరికివేసి, నిష్కామకర్మను ఆచరించు. యుద్ధం చెయ్యి.

**కర్మ సన్యాస యోగం**

కర్మ జ్ఞాన యోగాలు శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించాడు. ఆ బోధలను వినిన అర్జునునికి ఈ రెండిటిలో ఏది శ్రేష్ఠమో అనే సంశయం వచ్చి, 'కృష్ణా! ఒకసారి కర్మసన్యాసం (కర్మత్యాగపూర్వకమైన జ్ఞానం) చేయమంటావు. మరొకసారి కర్మయోగం మంచిదంటావు. ఈ రెంటిలో ఏది శ్రేష్ఠమో నాకు తెల్చిచెప్పు' అన్నాడు అర్జునుడు.

దానికి సమాధానంగా శ్రీకృష్ణ భగవనాడు ...

"అర్జునా! ఈ రెండూ మోక్షాన్ని కలుగుజేసేవే. అయితే ఈ రెండిటిలో కర్మసన్యాసం కంటే కర్మయోగమే శ్రేష్ఠమైనది. దేనిమీదా ద్వేషం, కోరిక లేనివాడు, సుఖదుఃఖాది ద్వంద్వాలు లేనివాడు సులభంగా భవబంధాల నుండి విముక్తి పొందుతాడు. అయితే జ్ఞానయోగులు పొందే ఫలమే కర్మయోగులు పొందుతారు. ఈ రెండూ ఒక్కటే అని గ్రహించినవాడే జ్ఞాని. కర్మయోగం అవలంబించకుండా సన్యాసం సాధ్యపడదు. నిష్కామ కర్మచేసేవాడు అచిరకాలంలో బ్రహ్మసాక్షాత్కారం పొందుతాడు. అతడు నిర్మల హృదయుడై ఇంద్రియ నిగ్రహం కలవాడై సమస్త జీవులలోను, తనలోను ఉన్న ఆత్మ ఒక్కటే అని తెలుసుకుంటాడు. అలా తెలుసుకున్న

కర్మలు చేసినా అతనికి ఏ దోషమూ అంటదు. అట్టి యోగి,
నైవకించిత్కరోమీతి, యుక్తోమన్యేత తత్త్వవిత్।
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్, అశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ప్రలపన్
విసృజన్ గృహ్ణన్, ఉన్మిషన్ నిమిషన్నపి।
ఇన్ద్రియాణీంద్రియార్థేషు, వర్తంత ఇతి ధారయన్॥ 8, 9

చూడటంలో, వాసనచూడటంలో, తినటంలో, నడవటంలో, నిద్రపోవటంలో, ఊపిరి పీల్చటంలో, మాట్లాడటంలో, గ్రహించటంలో, కనులు తెరవటంలో, మూయటంలో, ఆ యా ఇంద్రియాలు వాటి విషయాలలో ప్రవర్తిస్తున్నాయి అని తెలుసుకున్నవాడై, తానేమీ చలించకుండా ఉంటాడు. అతడు నీటి మీద తామరాకులాంటివాడు. అట్టి నిష్కామకర్మ యోగి కర్మఫలాన్ని విడిచి, ఆత్మజ్ఞానం వలన కలిగే శాశ్వత శాంతిని పొందుతాడు. అలా ఆత్మజ్ఞానంతో అజ్ఞానాన్ని రూపుమాపుకున్న వాడై పరబ్రహ్మ స్వరూపాన్ని సాక్షాత్కరింప చేసుకుంటాడు.

విద్యా వినయ సంపన్నే, బ్రాహ్మణే గవి హస్తిని।
శునిచైవ శ్వపాకే చ, పండితా స్సమదర్శినః॥ 18

అట్టి ఆత్మజ్ఞాన సంపన్నులు విద్య వినయాలు కలిగిన బ్రాహ్మణుడిని, గోవును, ఏనుగును, కుక్కను, చండాలుని సమదృష్టితో చూస్తారు. అట్టివారు సంసార బంధాన్ని ఈ జన్మలోనే జయిస్తారు.

యోஉన్తస్సుఖోஉన్తరా రామః, తథాంతర్జ్యోతిరేవ యః।
స యోగీ బ్రహ్మనిర్వాణం, బ్రహ్మభూతోஉధిగచ్ఛతి॥ 24

అట్టి యోగి ఆత్మలోనే ఆనందిస్తూ, క్రీడిస్తూ, ఆత్మలోనే ప్రకాశిస్తూ, బ్రహ్మనిర్వాణ స్థితిలో బ్రహ్మానందం పొందుతాడు.

స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్, చక్షుశ్చైవాంతరే భ్రువోః।
ప్రాణా పానౌ సమౌ కృత్వా, నాసాభ్యంతర చారిణౌ॥ 27

బాహ్యవిషయాలను విడిచి, దృష్టిని కనుబొమల మధ్య నిలిపి, నాసికలో సంచరించే ప్రాణవాయువును సమానం చేసి, ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని వశపరచుకుని, మోక్షమే లక్ష్యంగా, ఆశ, క్రోధ, భయాలను విడిచిపెట్టిన ముని నిరంతరం ముక్తుడై ఉంటాడు.

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము - సుశీలా ప్రసాద

41. శ్లో॥ అమున్య ధన్యాని దినాన్తరాణి
హరే త్వదాలోకన మన్తరేణ
అనాధబన్ధో! కరుణైక సిన్ధో !
హా హన్త! హా హాన్త కథం నయామి ॥

తాత్పర్యము -



దిక్కులేనివారికెల్ల దిక్కైన ఓ కృష్ణా! నీ దర్శన లేమిచే వ్యర్థములైన ఈ దినములను హరిహరీ! నేనెట్లు గడుపుచుంటిని?

తల్లిదండ్రులు లేని పూర్ణని ఎరిగిన వారందరూ ఎంతో ప్రేమగా ఆదరించి, ఆప్యాయంగా ఏ లోటూ లేకుండా పెంచుతూ వచ్చారు. వాళ్ళ పిల్లలతోపాటు ఎదిగి పెద్దయిన పూర్ణని పెళ్ళిచేసి పంపాలని, ఏ వయస్సుకు ఆ ముచ్చట అని అందరూ పూర్ణతో చెప్పారు.

పూర్ణ "మీ అందరి ఇళ్ళలోనూ నేను ఎంతో చనువుగా తిరుగుతూ నేనూ మీలో ఒకరినైపోయాను. మరిప్పుడు వేరుపెడుతూ ఎవరికో ఇచ్చి కట్టబెట్టి సాగనంపుతారేమిటమ్మా?" అనేది.

పూర్ణ మాటలు విన్న పెద్దవారు నొచ్చుకుంటూ, "అదేం కాదమ్మా ఈడువచ్చిన పిల్లవు. నీకంటూ ఒకతోడు ఉంటే మా బాధ్యత తీరుతుంది అని అన్నాము కాని, నిన్ను దూరం చేసుకోగలమా తల్లీ! పోనీ నువ్వు చెప్పినట్లు పొరుగూరు పిల్లలెవరినైనా చేసుకుంటే మమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళాలేమో, పోనీ మన పిల్లలలోనే ఎవరైనానా మనస్సు పడితే చెప్పమ్మా! ఆ మూడుముళ్ళు వేయించేస్తాము" అన్నారు.

పూర్ణ వెంటనే "అబ్బే! అదెలాగమ్మా! చిన్నప్పటి నుండి మీ మగ పిల్లలతో కలిసిమెలిసి తిరిగి, ఆటలు ఆడినదాన్ని. వారందరూ నన్ను అక్కా, చెల్లీ అనిపిలుస్తుంటే, ఒక అమ్మ కన్న బిడ్డల్లాగా పెరిగాము. వాళ్ళలో ఎవరో ఒకరిని ఎలా చేసుకోవటం? అయినా అసలెందుకో నా మనస్సుకు పెళ్ళి ఆలోచన రావటం లేదు. పెళ్ళి వలన కలగే లాభమేమిటి అని నాకు అనిపిస్తోంది" అన్నది.

అది విన్న పెద్దవాళ్ళు "పెళ్ళిచేసుకుంటే చక్కగా పిల్లా పాపా కలుగుతారు. వారితో ఆటపాటలు, అచ్చటా ముచ్చటా....." అంటుంటే, "చిన్నమ్మా! ఏదీ నా తల్లిదండ్రులు నాతో గడిపిన రోజులు చాలా తక్కువ. నాకు ఊహ సరిగా రాకుండానే మా నాన్న పొలంలో పిడుగుపడి చనిపోయాడు; మా అమ్మ యమునకు నీళ్ళకని వెళ్ళి మునిగిపోయింది. అవన్నీ గుర్తుకువచ్చి ఎందుకో నాకు జీవితం అంటే విరక్తిగా ఉంటుంది. వాళ్ళిద్దరూ నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయారు కదా! అందుకని నన్ను విడిచి పెట్టి వెళ్ళని తోడు ఉంటే నాకు వెతికిపెట్టండి" అన్నది పూర్ణ.

"నీ తోటి పిల్లలంతా పెళ్ళిళ్ళు చేసుకుని అత్తవారింటికి వెళ్ళారు కదా! అందుకని నిన్ను కూడా ఒక ఇంటిదాన్ని చేద్దామని ఆలోచన. అంతేకాని నీవు మాకు భారం కాదమ్మా!" అన్నాడొక పెద్దాయన.

తనని గురించి ఆలోచిస్తున్నా కూడా వారి మాటలను పూర్ణ అంగీకరించ లేకపోయింది. కాని ఒక ఆలోచన తట్టింది. వెంటనే పూర్ణ వారితో "పూర్వం లాగా మీ ఇళ్ళల్లో కొత్తగా వచ్చిన అల్లుళ్ళతో, కోడళ్ళతో కలిసి స్వేచ్ఛగా తిరగాలంటే మొహమాటంగా ఉంటోంది. పోనీ! నాకు ఒక ఇల్లు కట్టించి ఇచ్చి, నన్ను అందులో ఉంచి మీరందరూ వచ్చి నన్ను చూస్తూ ఉండండి. అప్పుడు నన్నొక ఇంటిదాన్ని చేయాలన్న మీ కోరిక, నా కోరికా కూడా నెరవేరుతుంది" అన్నది. ప్రస్తుతానికి ఈ ఆలోచన అందరికీ నచ్చింది.

అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో పూర్ణకి ఇల్లు కట్టించి, ఒక ఆవు దూడను, నాలుగు వంటగిన్నెలను కూడా అందరూ కలిసి పూర్ణకు ఏర్పాటు చేశారు. పాలు పెరుగు తీసి మధురలో అమ్ముకుంటూ స్వేచ్ఛగా జీవితం తృప్తిగా గడుపుతోంది పూర్ణ. అందరూ వచ్చిచూసి వెడుతూ ఉన్నారు. ఇంటి చుట్టూ ఆవరణలో పూల మొక్కలు కూరగాయ మొక్కలు పెంచుతోంది. పాలు తీసి పట్టణానికి వెళ్ళి అమ్ముకురావటం, మొక్కల పెంపకం, ఆవును మేపటం ఇటువంటి పనులతో పూర్ణకి ఊపిరాడకుండా రోజులు గడిచిపోతున్నాయి. పనులు ఎక్కువవటంతో ఇదివరకులాగా ఇంటికి వచ్చేవారి రాకపోకలు కూడా తగ్గిపోయాయి. నెమ్మదిగా పూర్ణ గురించి పట్టించుకునేవారి సంఖ్యకూడా తగ్గిపోసాగింది.

- సశేషం

# మానసిక శక్తిని పెంపొందించుకున్న యోగి

(జూన్ 1991 సద్గురు మాసపత్రికలో ప్రచురించబడిన వ్యాసము)

తన యొక్క మానసిక శక్తులను పెంపొందించుకున్నట్టి యోగి ఆకర్షణీయమైన, మనోహరమైన ఆకారాన్ని కలిగి ఉంటాడు. సద్గుణాలు, సత్ప్రవర్తన, దివ్యత్వము, సౌష్టవత్వముతో కూడిన ఆరోగ్యవైన దేహము, తేజోవంతవైన ముఖవర్చస్సు, ప్రకాశవంతమైన నేత్రములు, ప్రతిభా వంతమైన సంభాషణ, మధురమైన వాణి మొదలగు దివ్యమైన లక్షణాలు కలిగియున్న యోగిని ఎవరు సమీపిస్తారో, వారు క్షణకాలంలోనే ఉత్కృష్టమైన ఆధ్యాత్మిక ప్రేరణను పొందుతారు.

ఆ యోగి మూలముగ జనులు బలము, శాంతి, ఆనందములతో విలసిల్లుతారు. ఆయనతో సంభాషించినత మాత్రానవారు ఆధ్యాత్మిక ప్రేరణను, ఆయన స్పర్శమాత్రం చేత మానసిక వికాశమును పొందుతారు.

సంకల్పానికి కదలిక ఉంటుంది. అది మహా ప్రతిభాశాలియైనది. హిమపర్వత గుహలలో ప్రశాంతంగా కూర్చున్న యోగి, లేక ఋషీశ్వరుడు తన యొక్క సంకల్పబలంతో విశ్వమంతటిని పవిత్రవంతమొనర్చ గలడు. ఈ కార్యానికి అతడు బహిరంగంగా సభావేదికలపై ఉపన్యాసాలు, ప్రవచనాలు ఈయనవసరం లేదు.

సత్త్వము మిక్కిలి చురుకుదనం గలది. కదిలక లేనట్లుగా కనబడే చక్రము నిజానికి అతి వేగంగా తిరుగుతుంటుంది. సత్త్వం యొక్క ప్రభావం ఇలాగే ఉంటుంది. సాత్విక పురుషుని యొక్క స్వభావం కూడా ఇలాగే ఉంటుంది.

# అమృతబిన్దూపనిషత్

(గత సంచిక తరువాయి) సేకరణ - పరాశర ప్రసాద్

మోక్షానికి, బంధానికి రెండిటికి మనస్సే కారణమని ఉపనిషత్ చెబుతోంది. విషయాసక్తమైన మనస్సు బంధానికి హేతువు. విషయాసక్తం కానిది మోక్షానికి తీసుకువెడుతుంది. మోక్షము క్రొత్తగా పొందేది కాదు. నీ స్వరూపమే ముక్తి లేక మోక్షము. బంధనలో ఉన్నాననుకోవటమే భ్రమ. బంధం తొలగాలనుకోవటం అంతకంటె పెద్ద భ్రమ.

ఇవన్నీ జాగ్రదావస్థలోనేగా! సుషుప్తిలో సంసారం ఉందా? లేదు కదా. పోనీ అంతఃకరణ ఉందా? అందువలన బంధం ఉన్నది అని అనుకుంటున్నావు కాబట్టి మోక్షాన్ని గురించి చెప్పుకోవలసి వస్తోంది. మనస్సు అంటే ఏమిటి? మనస్సనేది వృత్తి. సంకల్పముతో కూడిన వృత్తి మనస్సు. నిర్ణయాత్మకమైన వృత్తి బుద్ధి. చింతనాత్మకమైన వృత్తి చిత్తము. ఏదైతే క్రియ చేస్తుందో అది అహంకారము. వృత్తినిబట్టే మనస్సు నాలుగు విధాలుగా ప్రవర్తిస్తోంది.

చూడండి కాలువలో నీరు ప్రవహిస్తోంది. ఆ నీరు చెరువులోకి చేరుతుంది. చెరువు గుండ్రంగా ఉండవచ్చు, లేదా చతురస్రాకారంగా ఉండవచ్చు, లేదా దీర్ఘ చతురస్రాకారంగా ఉండవచ్చు. చెరువులో నీటి ఆకృతి, ఆ చెరువు యొక్క ఆకృతిని బట్టి ఉంటుంది. నీరు ఏ పాత్రలో ఉంచితే ఆ పాత్ర యొక్క ఆకృతిని పొందుతుంది.

ఒకే మనస్సు రెండు రకాలుగా ఎలా ఉంటుంది? అని అనుమానం రావచ్చు. ఒకే అగ్గిపుల్లతో ఇల్లు తగలబెట్టవచ్చు, లేదా కర్పూరం వెలిగించి దేవతామూర్తులకు హారతులివ్వచ్చు. అంతేకాదు తల్లి కొడుకు ఇద్దరూ ఉన్నారు. తల్లి ఉదయమే అన్ని పనులూ పూర్తిచేసుకుని ఉద్యోగానికి వెడుతుంది. తనతోపాటుగా కొడుకును కూడా తయారుచేసి స్కూలుకు పంపుతుంది. కొడుకు ముందుగా ఇంటికి వస్తాడు. స్కూలునుంచి రాగానే ఆకలి వేస్తుంది కాబట్టి పాలు, బిస్కట్లు ఇంట్లో పెట్టి, వెళ్ళేటప్పుడు ఇంటికి తాళం వేసి, తాళం కొడుక్కు తెలిసిన ప్రదేశంలో ఉంచి తాను వెళ్ళిపోతుంది. కొడుకు ముందుగా ఇంటికి వచ్చాడు. ఇంటి

తాళం ఎలా తీయాలో తెలియలేదు. ఇంటి ముందు నిల్చుని ఏడుస్తున్నాడు. చుట్టు ప్రక్కల ఉన్నవారంతా వచ్చారు. పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడో తెలియలేదు. పిల్లవాడిని ప్రశ్నించారు.

వాడు సమాధానం చెబుతూ "మా అమ్మ ఇంటికి తాళం వేసి, తీసే తాళం చెవి తాను తీసికెళ్ళి, వేసిన తాళం చెవి ఇక్కడ పెట్టింది" అని చెబుతాడు.

అప్పుడు అక్కడ ఉన్నవారంతా వాడికి ఒకేతాళం చెవి వేయటానికి తీయడానికి కూడా ఏలా ఉపయోగ పడుతుందో తెలియజేశారు. ఆ పిల్లవాడి దుఃఖాన్ని నివారించగలిగారు.

అలాగే ఒకే మనస్సు బహిర్ముఖమైతే బంధము, అంతర్ముఖమైతే మోక్షము కదా! అంతెందుకు అద్దం ఉన్నదనుకోండి. బయటవైపుకు త్రిప్పితే ప్రపంచం కనబడుతుంది. నీవైపుకు త్రిప్పుకుంటే నీ స్వరూపం గోచరిస్తుంది. ఇది మనకందరికీ అవగతమే కదా!

జీవుడు నిషిద్ధ కర్మ ద్వారా మనస్సు మలినమవుతుంది. నిషిద్ధ కర్మాచరణకి కారణము మనస్సు లేదా వృత్తి. అదే అజ్ఞానమంటే. మనో మాలిన్యం ద్వారా కామక్రోదాధి గుణాలు ప్రకోపిస్తాయి. సద్గురుమూర్తి సమాశ్రయం చేత పుణ్య కర్మలు ఆచరిచటం ద్వారా మనో మాలిన్యం రహితం అవుతుంది. ఇది మనకు సాధ్యమేనా అని సంకోచం వద్దు.

శ్రీరామచంద్రుని ఆశ్రయించిన హనుమ జ్ఞాని అవలేదా? అలాగే వాల్మీకి మహా పండితుడు అవలేదా? అందువలన ప్రాపంచిక విషయాదులను వదిలి గురుపాదాలను ఆశ్రయించినవారికి ముక్తి ప్రత్యక్ష అనుభవం.

ప్రత్యక్షము అంటే నీవే. అది ఎంత తేలికో! శబ్ద స్పర్శ రూప రస గంధములకు వశమైన వారికి మోక్షం చాలా కష్టతరం. అటువంటి వారి మనస్సు బహిర్ముఖమై ఉంటుంది. అంతర్ముఖమైన వారిమనస్సుకు మోక్షం కరతలామలకం.

- సశేషం

# సద్గురు శ్రీ యాత్రాదర్శన్

(గత సంచిక తరువాయి) -డా॥ సుధ

15-5-2014 : ఉదయం 8-30ని॥లు శ్రీనగర్ (కాశ్మీర్‌కి) బస్సులో బయలుదేరాము. 12గం.లు ప్రయాణంచేసి, రాత్రికి శ్రీనగర్ చేరుకున్నాం. ప్రకృతి సౌందర్యం దారిలో కనువిందు చేస్తే, రోడ్లు బాగాలేక ప్రయాణం కుదుపులతో సాగింది. రాత్రి హోటల్‌లో విశ్రాంతి.

17-5-2014 : ఉదయం ఫలహారం చేసి, కొండపైన ఉన్న శంకరాచార్య ఆలాయం వెళ్ళాము. చాల ఎత్తుగా ఉన్న మెట్లు ఎక్కి వెళ్ళాము. చాలా పెద్ద శివలింగం. శంకరాచార్య వల్ల ప్రభావితుడైన ఒక సైనిక అధికారి దానిని స్థాపించాడు. శంకరాచార్యులు తపస్సు చేసిన ప్రదేశం కూడా ప్రక్కనే ఉంది. చాలా ప్రశాంతంగా, బాగా ఎత్తుపైన ఉన్న పవిత్రమైన వాతావరణం. ఋషులు ఇటువంటి వాతావరణం కోసమే కొండలపైన, అరణ్యాలలో నదీ తీరాలలో తపస్సు చేసుకుంటారు. అక్కడి నుండి డాల్‌లేక్ వెళ్ళాం.

డాల్‌లేక్ -

ఒక గంటసేపు పడవ మీద తిరిగాము. చాలా పెద్ద సరస్సు. ఆ సరస్సుని శుభ్రం చేస్తున్నారు. నలుగురం కలిసి ఒక పడవలో ప్రయాణం గంటసేపు చేశాము. పడవలో వెళ్తూ, వేరే పడవలో ఉన్న మన భక్తుల గ్రూప్‌తో కలిసి ప్రక్క ప్రక్కనే 10 ని॥లు మాట్లాడుకుంటూ ప్రయాణిస్తున్నాము. మళ్ళీ విడిపోయి, ఇంకొక పడవతో కలిసి ఇంకొంతసేపు ప్రయాణం. మాతాజీ పడవతో కూడా కలిసి కొంతసేపు ప్రయాణం. అదే విధంగా సంసారమనే సాగరం అత్యంత పెద్ద చెరువులో ఒక్కొక జన్మలో కొందరితో అనుబంధం. ఋణం తీరగానే విడిపోతాము. ఇంకొక జన్మలో ఇంకొంతమందితో అనుబంధం. మన భాగ్యం కొద్ది భగవంతుడు మనమీద దయతో గురువుగా మానవరూపంలో వచ్చి ఒక జన్మలో మనతో కలిసి ఉంటాడు. ఈ అవకాశం

వదులుకోకుండా, ఆ అనుబంధం శాశ్వతం చేసుకుంటే బాహ్యరూపం కనిపించకుండా పోయినా, శాశ్వతమైన ఆత్మ బంధం వలన సంసార సాగరాన్ని తరించడానికి వీలవుతుంది. పడవ ఇళ్ళు, ఇంకా అందమైన దృశ్యాలు చాలా చూశాము.

18-5-2014 :

ఉదయం సారికమాత ఆలయం వెళ్ళాము. చాలా మెట్లు ఎక్కవలసి వచ్చింది. పెద్ద పిండి రూపం, నారింజ రంగులో ఉన్నది. ఈ దేవిని లంక నుండి హనుమంతుడు తీసుకు వచ్చాడు. ఇద్దరు రాక్షసులు శ్రీలంకలో, అమ్మ ఉండే ప్రదేశంలో భిభీత్సం చేస్తూంటే, హనుమంతుడు నోట్లో చిన్న రాయిని పెట్టుకువచ్చి, ఆ రాయితో రాక్షసులను భూస్థాపితం చేసి, అమ్మవారిని ఇక్కడికి తీసుకు వచ్చాడు. అమ్మ అప్పటి నుండి అక్కడే ఉండిపోయింది. అమ్మ ఇష్టం లేకుండా మెట్లు ఎక్కివచ్చిన వారిని కూడా తన సన్నిధికి రాకుండా తిరిగి పంపివేస్తుంది. ఆ ఆలయ దర్శనం చేసినవారికి చార్‌ధామ్ చూసిన ఫలితం కలుగుతుంది. రాత్రి సమయంలో పులి మీద అమ్మవారు తిరిగటం యోగ్యులైన భక్తులు చూశారు. తరువాత క్షీర్‌భవాని ఆలయం వెళ్ళాము.

భవాని లంకలో రావణుని అకృత్యాలు చూడలేక చల్లని ప్రదేశానికి తీసుకు వెళ్ళమని హనుమంతుని కోరింది. హనుమంతుడు ఇక్కడికి తీసుకు వచ్చాడు. అమ్మతోపాటు 300 నాగులు కూడా వచ్చాయి. అమ్మ మడుగు మధ్యలో ఉంటుంది. మడగులో పాలుపోసి అమ్మ ముందు దీపం వెలిగించి, తాడు ఒక కడ్డీకి కట్టాలి. అమ్మకు పాలు ఇష్టం కాబట్టి ఈ విధంగా పాలు నైవేద్యంమిస్తారు. తరువాత ఖీర్ ప్రసాదం అందరం తీసుకున్నాము. మధ్యాహ్నం మొఘల్ గార్డెన్స్‌లో భోజనం చేశాము. అందమైన రకరకాల పువ్వులతో ఆ ఉద్యానవనం శోభిస్తోంది. హొటల్‌కి తిరిగి వచ్చిన తరువాత ఆ సాయంత్రం ప్రార్థన, సత్సంగం చేసుకున్నాము.

- సశేషం

**శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ రెసిడెన్షియల్ స్కూలు**

**(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపు పొందిన సంస్థ)**

**అతి తక్కువ ఫీజులతో, ఉత్తమ విద్యాబోధనతో నడుపబడుతున్న 'ఏకైక విద్యా సంస్థ'**

అడ్మిషన్లు జరుగుచున్నవి

త్వరపడండి!

కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవముతో కూడిన అధ్యాపకుల ద్వారా అందింపబడేది. నర్సరీ నుండి ఎల్.కె.జి తో సహా టెన్త్‌క్లాసు వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో శిక్షణ ఇవ్వబడుతుంది.

**ప్రత్యేకతలు**

- ✶ ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
- ✶ క్రమశిక్షణ, సత్ ప్రవర్తన
- ✶ రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటము
- ✶ వీక్లీటెస్ట్‌లు, డైలీ అసైన్‌మెంట్లు
- ✶ డేస్కాలర్స్‌కి బస్సు సౌకర్యము
- ✶ బాలబాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి
- ✶ నర్సరీ నుండి 1వ తరగతి వరకు ఉచిత మధ్యాహ్న భోజనము అమలు.

2012-13 నుండి శ్రీచంద్రకాళీవిద్యానిధి 1మరియు 2 ప్రారంభం

350మంది అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

సంస్కృతం మరియు హిందీ పరీక్షలకు శిక్షణ

స్కాలర్‌షిప్‌లను పొందిన విద్యార్థులకుస్కాలర్‌షిప్‌ను డిగ్రీవరకు కొనసాగించుట 'శ్రీ చంద్రకాళీ విద్యానిధి' ప్రత్యేకత

మంచి విలువలతో కూడిన తెలుగు, ఇంగ్లీషు, హిందీ గ్రంథాలయము

కంప్యూటర్ ఎడ్యుకేషన్ మరియు సైన్స్ ల్యాబ్ సౌకర్యం కలదు.

గమనిక – స్కూలు ది. 2-6-2015న తెరువబడును.

వివరములకు

కరస్పాండెంట్ గారిని స్వయంగా గాని,

ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

డా॥కె.వి. ఆర్. రమణ M.Sc., Ph.D.

కరస్పాండెంట్

ఫోన్ : 0863 - 2594211(స్కూలు); 0863 - 2293824 (ఇల్లు)

మొబైల్ - 93932 20400

# సాలెవాడు - రామేచ్ఛ

ఒకానొక ఊళ్ళో పుణ్యాత్ముడైన ఒకసాలె ఉండేవాడు. అతడి భక్తిని పవిత్రహృదయాన్ని చూసి అందరూ అతణ్ణి నమ్మి ప్రేమించేవారు. ఆ సాలె తాను నేసిన వస్త్రాలను విక్రయించటానికై బజారుకు వెళ్ళి, కొనటానికి వచ్చిన వారితో ఇలా అనేవాడు 'రామేచ్ఛవల్ల నూలు ఖరీదు ఒక రూపాయి రామేచ్ఛవల్ల కూలీ పావలా, రామేచ్ఛవల్ల ఈ వస్త్రం ఖరీదు ఇప్పుడు రూపాయి ఆరు అణాలు' అనేవాడు. జనం అతను ఏ ఖరీదు చెప్పినా మాట్లాడకుండా కొనుక్కునే విశ్వాసం అతడిలో కలిగి ఉన్నారు. నిజానికి అతడు గొప్ప భక్తుడు, రాత్రులలో భోజనానంతరం భగవన్నామ స్మరణ చేస్తూ, భగవత్ ధ్యానంలో గడిపేవాడు.

ఒకరోజు రాత్రి చాలా పొద్దుపోయింది. అతడింకా నిద్రపోలేదు. చావడిలో ద్వారం వద్ద కూర్చుని చుట్ట తాగుతూ ఏకాంతంగా ఉన్నాడు.

అప్పుడు ఆ దోవగుండా ఒక దొంగల గుంపు పోతోంది. వారికొక మూటలు మోసేవాడు కావలసి వచ్చింది. ఈ సాలెవాణ్ణి చూడగానే వారు ఇతణ్ణి పట్టుకుపోయారు.

తరువాత వాళ్ళు ఒక ఇంట్లో జొరబడి ఇల్లంతా దోచుకున్నారు. దానిలో కొంత ఈ సాలెవాడి నెత్తిమీద పెట్టి మోయ మన్నారు. ఇంతలో రక్షకభటుడు ఆ దోవలో రాగా, దొంగలు పారి పోయారు.

నెత్తిమీద దొంగిలించిన సొమ్ము మోస్తున్న సాలెవాడు పట్టు బడ్డాడు. ఆ రాత్రికి అతడు చెరసాలలో గడపవలసి వచ్చింది. మరునాడు రాజుగారి దగ్గరకు విచారణకు తీసుకుపోయారు.

జరిగిన సంగతి అంతా తెలిసి, గ్రామస్థులందరూ కలిసి రాజుగారి దగ్గరకు పోయి, "అయ్యా! ఇతడు అమాయకుడు. దొంగతనం చేయ లేడు" అని ఏకగ్రీవంగా చెప్పారు. అప్పుడు న్యాయాధికారి జరిగినది చెప్పమని సాలెవాణ్ణి అడిగాడు. అతను ఇలా చెప్పసాగాడు....

"అయ్యా! రామేచ్ఛ వల్ల నేను చావడిలో కూర్చున్నాను. రామేచ్ఛ వల్ల చాలా పొద్దుపోయింది. రామేచ్ఛవల్ల నేను రామనామస్మరణ చేస్తూ గడుపుతున్నాను. రామేచ్ఛవల్ల కొంతమంది దొంగలు అటుగా వచ్చి నన్ను వారితో కలిపి ఈడ్చుకుపోయారు. రామేచ్ఛవల్ల ఆ దొంగలు ఒక ఇంటికి

కన్నం వేసి, ఆ దొంగిలించిన సొమ్మును నా నెత్తినపెట్టి నన్ను మోయమని అన్నారు. రామేచ్ఛ వల్ల రక్షకభటులు నన్ను దొంగగా భావించి చెరసాలలో ఉంచారు. రామేచ్ఛ వల్ల నేను మీ దగ్గరకు విచారణకు తీసుకురాబడ్డాను".

న్యాయాధిపతి అతని నిష్కాపట్యానికి, పారమార్థిక చింతనకు సంతోషించి, వెంటనే అతనిని విడుదల చేయించాడు.

బయటకు వచ్చి అతడు బంధుమిత్రులతో "రామేచ్ఛ వల్ల నేను బంధ విముక్తుణ్ణి అయ్యాను" అని చెప్పాడు.

నీతి -

నువ్వు సంసారంలో ఉండటం గాని, సంసారాన్ని త్యజించటం గాని - సర్వమూ రామేచ్ఛ మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి సమస్త భారాన్ని ఆ భగవంతుడి మీద వేసి, నీ విహిత కర్మను నిర్వర్తించాలి.

---

('గురువు ఎంతమంచివారు!' - 6వ పేజీ తరువాయి భాగం)

మనని మరువకుండా ఉండే తల్లీ, తండ్రీ, గురువూ - దైవమూ-సర్వమూ భగంతుడే (గురుదేవుడే). మనసులో నీ సుందర రూపం ఏనాడూ మరపురాకుండా కాపాడు తండ్రీ! అని ప్రార్థించాలి.

ఏడేడు పధ్నాలుగు లోకాలూ నిండి ఉన్న ఆయన్ని, నీ మెడలో ఉన్న లాకెట్ వరకే చూస్తావో, అనంతంగా చూస్తావో నీ మీదే ఆధారపడి ఉంది. పద్నాలుగు లోకాలనూ తన బొజ్జలో పెట్టుకున్నాడు పరమాత్మ. కనుక ఇప్పుడు మనం ఎక్కడ ఉన్నామని ఒక్కసారి విచారణ చేయండి.

నీచత్వం వైపే చూస్తే, ప్రక్కన ఉన్న కుళ్ళు కాలవలకి, ఆ మనస్సుకీ తేడా లేదు. నీ స్వరూపం అనంతమై ఉంది. అది గుర్తించు. నిరంతరం ఎప్పటికప్పుడు విచారణ చేసుకోవటమే ధ్యానం అంటే.

'నేను ధ్యానం చేస్తున్నాను' అనే దానిలో 'నేను చేస్తున్నాను' అనేది తీసివేస్తే 'ధ్యానమే' మిగులుతుంది. అట్టి దివ్య ధ్యాన స్థితిని, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# ఇంద్రద్యుమ్నుడు

(గత సంచిక తరువాయి)

- కామేశ్వరీ ప్రసాద

"ఎన్ని విధాల ప్రార్థించినా కనికరింపవేమి? ఏమి చేయాలి? కలడందురు దీనులయెడ అంటారే! నేను దీనుడనై నిన్ను వేడుకొంటున్నాను. ఓహో! పరమయోగులయందు ఉంటాడా! పరమేశ్వరా నాకు ఆ అదృష్టం లేదా?" అలా పరిపరివిధాల ఎలుగెత్తి వేడుకున్నాడు. చివరకు వినుగెత్తి గజేంద్రుడు "పరమేశ్వరా! నాకు శరీరంలో బలం తగ్గి పోయింది. ఇహ నేను బ్రతుకుతాననే ఆశ నాకు లేదు. ప్రాణములు వాటి స్థానములు తప్పిపోయినవి. శరీరం డస్సిపోయింది. ఈ శ్రమకు నేను ఓర్వజాలను. రావే ఈశ్వరా! కావవే వరదా!.." అంటూ అలవైకుంఠ పురంలో, లక్ష్మీదేవితో సరససల్లాపాలు



ఆడుతున్న నారాయణమూర్తికి వినబడేలా కేకవేశాడు. నారాయణమూర్తి పరుగుపరుగున వచ్చి మకరిని త్రుంచి గజేంద్రునికి మోక్షాన్ని ప్రసాదించాడు.

ఏ జీవుడు భగవంతునికి సర్వసమర్పణ చేస్తాడో, ఆ జీవుని తనలో జేర్చుకుంటాడు. ఇక్కడ అగస్త్యమహర్షి ఇంత కథ నడిపి, ఆ ఇంద్రద్యుమ్నుడికి మోక్షమిప్పించాడు.

అలాగే సద్గురుదేవుల అనుగ్రహాన్ని పొందిన శిష్యుడు జన్మ పరంపరలకు దూరమై జనన మరణ అవస్థలు లేకుండా శాశ్వతానందాన్ని పొందగలుగుతాడు!

# సత్సంగామృతం

(గత సంచిక తరువాయి) - మురళీ

గురుతత్త్వం సర్వవ్యాపకమైనది. ఉన్నదొక్కటే. అదే గురుతత్త్వం. గురువుని ఆశ్రయించనిదే గుర్తుతెలియదు మనకి. ద్వైతమేదో, అద్వైతమేదో మనం ఎలా గుర్తించగలము? అందువల్లనే అద్వైత సామ్రాజ్య చక్రవర్తియైన శ్రీగురుదేవులు ద్వైతమనే ఒక సాకార రూపాన్ని ధరించి మన చెంతకు వచ్చారు. సాకారంగా ఇంత సృష్టిని చేసిన వారి లీల ఊహాతీతం.

మీ మనస్సును ఒకసారి అంతర్ముఖం చేసి చూడండి. మోహనా కారుడు, మోహాన్ని నశింప జేసేటటువంటి సుందరమైన ఆయన దివ్య చరణారవిందాల పైనే మీ దృష్టి నిలపండి. శ్రీగురుదేవులు సాక్షాత్ నారాయణుడే అని గుర్తిస్తాము.



మనకు ఇంద్రియాలు కలిగినందుకు చాల చాల చూస్తున్నాము. ఇతరమైనవి ఎన్నో చూడటం జరుగుతోంది. ఇదంతా గురుదేవుడి సృష్టిలోనిదే అని గ్రహించాలి. కాని ఒక్కసారి నీ జీవితం అంటే ఏమిటో అర్థం చేసుకోవాలంటే, నిన్ను నువ్వు గుర్తించాలి. ఎన్ని రూపాలు చూసినా, ఎన్ని శబ్దాలు విన్నా, ఎటువంటి కర్మలెదురైనా, ఎటువంటి ధర్మాన్ని ఆచరిస్తున్నా, మనకు తలపుకు వచ్చేది ఎవరు? శ్రీగురుదేవులే!

దేవుడు ప్రసాదించిన రూపం ఏదో ఒకనాడు కనబడకుండా పోతుంది. రూపం ఏమైంది? ద్వైతం అద్వైత స్థితిని పొందుతుంది. గతంలో మనకున్న గురుసోదరులు, గురుసోదరీమణులు ఇప్పుడు ఏమైనారు? ఎక్కడికి వెళ్ళారు? ఉన్నది ఒక్కటే గురుపాదం. దానిలోనే లయమయ్యారు. ఆ ఉన్నదేదో గుర్తించటానికే మహాత్ములు మనకు తమ దివ్యలీలను

చూపిస్తున్నారు.

నిన్ను నువ్వు ఉద్ధరించుకోవాలంటే, ఏకాగ్రతతో సాధనచేసి, సాధించుకోవాలి. అటువంటి అద్వైత స్థితిని పొందాలంటే ఉన్నది ఒక్కటే అన్నది అనుభవంలోకి రావాలి. గురుదేవులయందు అచంచలమైన భక్తి విశ్వాసాలే మనలను ఆ స్థితికి చేరుస్తాయి.

గురుదేవులు మనకు ప్రార్థనలో ఏం చెప్పారు? 'మంచినే చేయుటకు, మంచినే చూచుటకు, మంచినే గ్రహించుటకు ....మాకు ప్రసాదించు' అని. మనం ప్రకృతిలో దేనిని గుర్తించాలి? మంచినే చేయాలి, మంచినే చూడాలి, మంచినే ఆలోచించాలి. మంచి హృదయం కలిగి ఉంటే అంతా మంచే జరుగుతుంది. భగవంతుని (గురుదేవుని) యందు పరిపూర్ణమైన అనురాగం, విశ్వాసం కలిగి ఉండాలి. గుండెమీద చెయ్యి వేసుకుని చెప్పండి, మనం రోజూ గురుదేవుల అపారమైన కరుణవలన బ్రతకటం లేదా? దానిని గుర్తించకపోవటమే మన దౌర్భాగ్యం. గుర్తిస్తే కలలోనైనా, ఇలలోనైనా, గుర్తువచ్చేది గురుపాదమే. గురి కుదిరితేనే మనం గురు పాదం యొక్క దివ్యత్వాన్ని గుర్తించగలుగుతాము. గురికుదరకపోతే జారిపోతావు.

శ్రీగురుదేవులు తమ బోధామృతంలో చెబుతూ ఉండేవారు - 'చిక్కుడు గింజవలె జారిపోకూడదు. నక్కిరి గింజవలె అతుక్కుపోవాలి' అని. గురుపాదాలకు అతుక్కుపోయిన హృదయం ఎంతో ధైర్య సాహసాలతో, సేవా పిపాసతో ఉంటుంది.

అందరిలో ఉన్న గురుదేవుని స్వరూపం, గురుదేవుని స్మృతి. గురుదేవులు ఏది మనకు ప్రసాదించారో దానినే అనుభవించటానికి ముందుకు వస్తాము కాని, పనికిరానివన్నీ వెంటబెట్టుకు వస్తామా? పనికి రానివన్నీ ఆలోచిస్తామా? అప్పుడు ద్వేషభావాలు, కామక్రోదాధి గుణాలు మనలో ప్రవేశించటానికి అందుబాటు ఉంటుందా? ప్రవేశించలేవు. ఎందుకని రాలేవు అంటే - గురుదేవుని దివ్యచరణాల స్మృతి మనం అనుభవిస్తున్నంతసేపూ వాటికి తావెక్కడిది? అటువంటి దివ్య చరణార విందములయందు ఏకాగ్రత చేయటమే ధ్యానం!

- సశేషం

# పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

నిత్య కార్యక్రమములు -

ఉదయం 4గం.లకు మేలుకొలుపు, సుప్రభాతం.

ఉదయం 4-30ని॥ నుండి 5-30ని॥ వరకు ప్రార్థన.

సాయంత్రం 7గం. నుండి 8గం. వరకు ప్రార్థన.

జూన్ 2015

11-6-15 గురువారం శ్రీగురుదశమి. సా॥ 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ

జులై 2015

11 శనివారం శ్రీగురుదశమి రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

31 శుక్రవారం శ్రీగురుపూర్ణిమ (ఆషాఢ) రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

వివరములకు 94912 22652

## రాజమండ్రి శాఖ ప్రారంభం

శ్రీ కాళీవన ఆశ్రమం, రాజమండ్రి శాఖ, ది. 8-6-2015 సోమవారం ఉదయం 7గం.47ని॥లకు నెం. 17-24-7/1, వంగవీటివారి వీధి, రత్న పిల్లల వైద్యశాల ప్రక్కవీధి, సీతం పేట, రాజమండ్రిలో ప్రారంభించ బడుచున్నది.

*గోదావరి పుష్కరముల సందర్భముగా ది.14.07.2015 మంగళవారము నుండి 25.07.2015 శనివారము వరకు ప్రతిరోజు ఉదయం, సాయంకాలం ప్రార్థన, సత్సంగం, భక్త సమారాధన, ఉచిత వైద్య శిబిరం ఈ శాఖలో జరుగును, వివరములకు సెల్ నెం. 9346535357*

# వైశాఖ పూర్ణిమ విశిష్టత

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

వైరాగ్యం అంటే ఏమిటి? ప్రాపంచిక విషయాదుల పట్ల విరక్తి. మానవునికి శత్రువైనా, మిత్రుడైనా, స్వర్గాన్ని సృష్టించినా, నరకాన్ని సృష్టించినా, క్షణాన్ని ఒక యుగంగా, యుగాన్ని ఒక క్షణంలాగా అనుభూతిని పొందేటట్లు చేసే శక్తి ఒక్క మనస్సుకు మాత్రమే ఉంది. అటువంటి మనస్సుని జయించిన వాడే విజేత, విజయుడు.

శ్రీసద్గురుదేవులు 'మనస్సు అంటేనే మాయ. మాయ అంటేనే మనస్సు' అని తరచుగా విశ్లేషించేవారు. మాయను జయించాలంటే మనస్సును గురుదేవుని పాదపద్మాలయందు నిలపాలి. మనస్సు నిశ్చలం అయినప్పుడు ఇంద్రియాలు కూడా చలన రహితం అవుతాయి. అంటే మనస్సును అంతర్ముఖం చేయాలి. అది చాలా కష్టమైన పని. అందుకనే భగవద్గీతలో అర్జునుడు మనందరికి ప్రతినిథిగా శ్రీకృష్ణుని ప్రశ్నిస్తూ....

చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్ ।
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥ 6/34

"మనస్సు చాలా చంచలమై, అతి బలవత్తరమైనది. ఈ జగత్తులో గాలిని నిరోధించలేనట్లే మనస్సును కూడా నిగ్రహించటం చాలా దుష్కరం" అన్నాడు అర్జునుడు.

దానికి సమాధానంగా శ్రీకృష్ణభగవానుడు ఇలా అన్నాడు...

అసంశయం మహాబాహో! మనోదుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేనతు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥

"ఓ మహాబాహో! నిస్సంశయంగా మనస్సు నిగ్రహించటానికి వీలు కానంత చంచలమైనది. కాని అభ్యాస, వైరాగ్యాలచేత మనస్సును నిగ్రహించ వచ్చు" అని అభయహస్తమిచ్చాడు.

ఇంద్రియాలన్నిటికి మనస్సు మెయిన్ స్విచ్‌లాంటిది అని

శ్రీగురు దేవులు. మనస్సును ఎప్పుడు అంతర్ముఖం చేస్తామో అప్పుడు ఇంద్రియాలు విషయాదులకు ఆకర్షితం కావు. 'మనకు ఎంత ఇష్టమైన మధురపదార్థమైన సరే, దాన్ని వమనం చేసుకున్న తరువాత ఏవగించుకుంటామే కాని, తిరిగి దాన్ని స్వీకరించటానికి అంగీకరించం కదా!' అనేవారు గురుదేవులు.

నీటి ప్రవాహంలో చిక్కుకున్నవాడికి దానిలో నుండి ఎలా బయట పడదామా అనే తప్ప వేరే దృష్టి ఉండదు. అలాగే తీవ్రమైన వైరాగ్య సంపన్నుడు ఈ ప్రపంచంలోని భోగభాగ్యాలన్నీ తృణప్రాయంగా భావిస్తాడు. నిర్వికారము, నిశ్చలమైన మనస్సుతో దృష్టిని ఏకోన్ముఖం చేసి, సత్యవస్తువుపై కేంద్రీకరిస్తాడు.

యమధర్మరాజు సమక్షంలో నచికేతుడు చూపిన వైరాగ్యం, 16సంవత్సరాల వయస్సులో శ్రీరామచంద్రుడు పొందిన వైరాగ్యం, బుద్ధుని వైరాగ్యము, ఆయన శిష్యుడు ఉపమన్యుని వైరాగ్యం తీవ్రవైరాగ్యాలు అనటానికి నిలువెత్తు నిదర్శనాలు. అట్టివారికి జీవితమంతా పున్నమే! శ్రీబాబూజీ మహరాజ్ పూర్ణిమ గురించి వివరిస్తూ "సున్నాకు సున్న కలిపినా, తీసేసినా, సున్నాను సున్నాతో హెచ్చవేసినా, సున్నను సున్నాతో భాగించినా మిగిలేది పూర్ణమే!

అలాగే ఒక జ్యోతితో ఎన్ని జ్యోతులు వెలిగించినా, ఆ జ్యోతి ప్రకాశమునకు లోటు ఉండదు. నీటితో పూర్తిగా నిండిపోయిన పాత్రలో ఇంకొక బొట్టు నీరుపోసినా అది నిలవదు. పూర్ణత్వంలో హెచ్చుతగ్గులకు తావు లేదు. పున్నమి వెన్నెల చల్లగా హాయినిస్తు, మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది.

అలాగే సంపూర్ణ వైరాగ్యసంపన్నుడైన సాధకుడు, గురుపుత్రుడు శాంతి, సుఖ, సంతోషాలతో విలసిల్లుతూ తన జీవితాన్ని నిత్య పూర్ణిమగా చేసుకుంటాడు.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

- విజయేశ్వరానంద ప్రసాద్

(గత సంచిక తరువాయి)

## నింద్రకొలను డాక్టరుగారితో శ్రీబాబు

భక్తుడైన ప్రహ్లాదుడి మాట ఋజువు చేయటం కోసం ఆనాడు శ్రీమన్నారాయణుడు స్తంభంలో అవతరించినట్లు, ఈనాడు అపర ప్రహ్లాదుడైన డాక్టరుగారి మాట ఋజువు చేటడానికి శ్రీబాబు ఆ ఏకదశి నాటి రాత్రి వచ్చి వారందరికి దర్శన భాగ్యం కలిగించారు. ఇక అప్పటి నుండి ప్రతి శుద్ధ ఏకాదశినాడు శ్రీబాబు నింద్రకొలను వచ్చేవారు - భక్తులు రప్పించుకునేవారు!



నింద్రకొలను డాక్టరుగారికి ధ్యానంలో శ్రీబాబు దర్శనం అయ్యేది. వారెప్పుడు వచ్చేదీ ఆయనకు ముందుగానే తెలిసేది. శ్రీబాబు సందేశం ఆయనకు ఏదో ఒక సంకేత రూపంలో అందేది. ఒకసారి పనిమీద డాక్టరుగారు బ్యాంక్‌కు వెళ్ళారు. అక్కడ ఉండగా ఆయనకు 'వెంటనే బయలుదేరి రా!' అని సంకేతం అందినది. అక్కడ డబ్బు, కాగితాలు అలాగే వదిలివేసి, డాక్టరుగారు బయలుదేరారు. కాని ఎక్కడికి? తెలియదు. తెలియవలసిన పనిలేదు. పిలిచినవారే తీసుకు వెడతారు అనే దృఢ విశ్వాసంతో అడుగులు వేసుకుంటూ, గురు స్మరణతో కాళ్ళు ఎటువెడితే అటు నడుస్తున్నారు. సర్వేంద్రియాలకు అధిపతి అయిన ఆ హృషీకేశుడు - శ్రీబాబు - కాళ్ళకు మాత్రం అధిపతి కాడా? అందుకని ఆ కాళ్ళు ఆ హృషీకేశుని ఆజ్ఞననుసరించి, డాక్టరు గారిని గుండుగొలనులో ఉన్న శ్రీబాబు వద్దకు తీసుకు వెళ్ళాయి. అక్కడ శ్రీబాబు వారికోసం ఎదురు చూస్తున్నారని కబురు వచ్చింది. "అదే భగవంతునికి - భక్తుని గల సంబంధం. Understand?" అని శ్రీబాబు అనేవారు.

ఒకసారి రాయలసీమ ప్రాంతంలో తీవ్రకరువుకాటకాలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో శ్రీబాబు డాక్టరుగారిని తక్షణం రాయలసీమ వెళ్ళి, అక్కడ ఏదో నిర్జన ప్రదేశంలో కూర్చుని, అక్కడి అనావృష్టి పరిస్థితులను తొలగించి, ప్రజలను కరుణించమని

భగవంతుని గురించి ధ్యానం చేయమని ఆదేశించారు. డాక్టరుగారు అలాగే చేశారు. వర్షాలు కురిశాయి. దేశానికి దుర్భిక్షపీడ వదిలింది. ఈ సంగతి ఆత్మీయులైనవారు కనిపెట్టి ప్రశ్నించగా, డాక్టరుగారు "సకల జవరాసులలో పనిచేసే శక్తి దైవశక్తియే. అంతేగాని జడమైన ఈ దేహానికి శక్తి ఎక్కడిది? ఏ గురుశక్తి మనకు ప్రేరణను ఇస్తుందో, ఆ గురుశక్తియే అది నెరవేర్చటానికి మనకు శక్తిని ప్రసాదిస్తుంది. అది 'గురు శక్తి' అని గ్రహిస్తే ధన్యుడవుతైడు. కాని అది 'నా  శక్తి' అనుకుంటే పతనమే" అన్నారు.

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

నిత్య కార్యక్రమములు -

ఉదయం 4గం.లకు మేలుకొలుపు, సుప్రభాతం.

ఉదయం 5గం. నుండి 6గం. వరకు ప్రార్థన.

సాయంత్రం 6గం. నుండి 7గం. వరకు ప్రార్థన.

ఆదివారములు -

సాయంత్రం 5గం నుండి 5-30ని॥ల వరకు సంకీర్తన.

సాయంత్రం 5-30ని॥ నుండి 7గం. వరకు ప్రార్థన, సత్సంగం.

జూన్ 2015

2-6-15 మంగళవారం పూర్ణిమ

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

11-6-15 గురువారం శ్రీగురుదశమి.

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

జులై 2015

2 గురు అధిక ఆషాఢపూర్ణిమ

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

11 శనివారం శ్రీగురుదశమి

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

31 శుక్రవారం నిజ ఆషాఢపూర్ణిమ

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

వివరములకు 6 856 66797

-గత సంచిక తరువాయి

# విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

## కబీర్‌దాస్

కమాల్ పన్నెండు సంవత్సరాల బాలుడైనాడు. ఒకనాడు తండ్రితో "నాకు పుణ్యక్షేత్రమైన ద్వారకను దర్శించాలని ఉంది" అన్నాడు. కుమారుని జ్ఞాన తృష్ణకు సంతోషించి కబీర్ అనుమతి ఇచ్చాడు.



కమాల్ రామనామం చేస్తూ తన్మయత్వంతో నడుస్తుంటే ఆ బాలుని చూసి అపర శుక్ర బ్రహ్మవలె ఉన్నాడని భావించి అతనికి అందరూ ఆతిధ్యమిచ్చి సత్కరించేవారు. సంకీర్తన చేయించుకుని ఆనందించేవారు.

ఇలా భక్తిని ప్రచారం చేస్తూ కమాల్ ద్వారక చేరాడు. అక్కడ కొన్ని రోజులు ఉండి స్వామిని మనసారా సేవించి తిరిగి కాశీ క్షేత్రానికి బయల్దేరాడు. దారిలో చిత్రకూటమనే గ్రామానికి చేరాడు.

ఆ ఊరిలో విష్ణుదాస్ అనే భాగవతోత్తముడు ఉన్నాడు. అతడు సంపన్న కుటుంబీకుడు. కమాల్‌ను చూడగానే అతడు మహాభక్తుడని గ్రహించాడు. తన గృహానికి ఆహ్వానించి ఆతిధ్యం ఇచ్చాడు. కమాల్ విష్ణుదాస్ ఇంట్లో సంకీర్తన చేశాడు. అతని అమృత గానానికి భక్తులంతా సమ్మోహితులయ్యారు. ఎవరు ఏ రూపంలో కానుకలు ఇచ్చినా స్వీకరించేవాడు కాదు. కమాల్ వైరాగ్యాన్ని చూసి విష్ణుదాసుడు విస్మయపడ్డాడు.

కమాల్‌కు ఏదన్నా పారితోషికంగా సమర్పించాలని విష్ణుదాసు అనుకొన్నాడు. ఒక విలువైన మాణిక్యాన్ని తెచ్చి కమాల్‌కు ఇవ్వబోయాడు. కమాల్ నిరాకరిస్తూ విష్ణుదాసా! ఏమిటి నువ్వు చేస్తున్నావు? విప్రులకు

విత్తము, మహారాజులకు మాణిక్యాలు, పేదవారికి పరమాన్నము, విరాగులకు వస్త్రము సమర్పించాలని నీకు తెలియదా? నీకు అభీష్టముగా ఉంటే ఒక గుడ్డముక్క నాకు ఇయ్యి చాలు. నాకు మాణిక్యాలు, ధనం అవసరం లేదు" అని చెప్పాడు.

విష్ణుదాసు ఒక నూతన వస్త్రం తెచ్చి అందులో అతనికి తెలియకుండా ఈ మాణిక్యాన్ని పెట్టాడు. ఇది వస్త్రమే అనే భావనతో కమాల్ స్వీకరించాడు. భక్తుల వద్ద శెలవు తీసుకుని స్వస్థలానికి బయలుదేరాడు.

ఇంటికి వచ్చి తన యాత్రా విశేషాలన్నీ కబీర్‌కు చెప్తున్నాడు. అవి వింటున్న కబీర్‌దాస్ ఆనందానికి అవధుల్లేవు. కమాల్ సంచి నుండి వస్తువులు తీస్తుంటే విష్ణుదాసు ఇచ్చిన వస్త్రం నుంచి మాణిక్యం కింద పడింది. అది చూసి కబీర్‌దాస్ కోపోద్రిక్తుడై "అమూల్యమైన రామనామాన్ని విక్రయించి ఈ నిర్జీవమైన మాణిక్యాన్ని సంపాదించావా? నీ ముఖం నాకు చూపకు. ఈ మాణిక్యాన్ని తీసుకు వెళ్ళి నీకు ఎవరు ఇచ్చారో వారికి తిరిగి ఇచ్చెయ్యి. అలా చేయకపోతే నువ్వు నా కుమారుడవు కావు. నేను నీ తండ్రిని కాను" అని శాసించాడు.

తండ్రి ఆజ్ఞానుసారం చిత్రకూటం వెళ్ళి మాణిక్యాన్ని విష్ణుదాసుకు సమర్పించి తిరిగి వచ్చాడు. కమాల్ భక్తి శ్రద్ధలను చూసి అందరూ "భక్త కమాల్" అని పిలిచేవారు.

కామినీ కాంచనాలను జయించినవాడే నిజమైన వేదాంతి. ఈ రెండింటికి బానిస అయినవాడు భక్తుడు కాలేడు అని కబీర్‌దాస్ అభిప్రాయం.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL